www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం

21-07-2024

సంపుటి : 01 | సంచిక : 78 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD



# రేవంత్ రెడ్డి సర్కారుది ప్రజా వ్యతిరేక పాలన

## కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ప్రతి స్కీమ్‌లో స్కామ్

- **రుణమాఫీ మొత్తం చేయకముందే సంబరాలా..?**
- **ప్రజల సొమ్ము ఇష్టానుసారంగా చేస్తామంటే కుదరదు**
- **బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం**

**విశ్వంభర, హైదరాబాద్:**

కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ప్రతి స్కీమ్‌లో స్కామ్ ఉంటుందని.. రేవంత్ రెడ్డి సర్కారుది ప్రజా పాలన కాదని.. ప్రజా వ్యతిరేక పాలన అని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ--- కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందని, రుణమాఫీ మొత్తం చేయకముందే సంబరాలు చేసుకుంటున్నారంటూ మండిపడ్డారు. ప్రజల సొమ్ము ఇష్టానుసారంగా చేస్తామంటే కుదరదనని.. రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి ఆంక్షలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కొంతమందికే చేసి మిగతా రైతులకు ఆంక్షలు పెట్టారన్నారు. రైతు పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ అని చెప్పి రేషన్ కార్డు ఆధారంగానే రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం, మెదక్ , మహబూబ్‌నగర్ జిల్లాలో చాలామంది రైతులకు రుణమాఫీ కావడం లేదని.. రూ.రెండు లక్షల రుణమాఫీ ప్రతీ రైతుకు కావాలని.. లేనట్లయితే అసెంబ్లీ, సచివాలయం ముట్టడిస్తామని వార్నింగ్ ఇచ్చారు.రైతు భరోసా యాసంగి పంటకు



ఇవ్వలేదని.. ఇప్పుడు వానాకాలం పంటకు కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని విరుచుకుపడ్డారు. రేవంత్ సర్కార్ రైతు, విద్యార్థి, నిరుద్యోగ, ప్రజావ్యతిరేక ప్రభుత్వం అంటూ మహేశ్వర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.



## హుస్సేన్ సాగర్ కు భారీగా వరద నీరు.. రెండు గేట్లు ఎత్తివేత

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో ఉదయం నుంచి ముసురు కంటిన్యూ అవుతోంది. ఆగకుండా కురుస్తున్న వర్షంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది.దీంతో హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్కు భారీగా వరద రావడంతో నిండుకుండలా మారింది. దీంతో అధికారులు 2 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. చెరువు పూర్తి సామర్థ్యం 514 అడుగులు కాగా ప్రస్తుతం 513 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. నగరంలో ఉదయం నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావటంతో నగరంలో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. నగరం శివారు ప్రాంతాల్లోనూ నిన్న సాయంత్రం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

వర్షా ల నేపథ్యంలో కలెక్టర్లకు

## మంత్రి పొంగులేటి కీలక సూచనలు



**విశ్వంభర, హైదరాబాద్:** గత రెండు రోజులుగా తెలంగాణలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలో భాగంగా రెవిన్యూ శాఖలో అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. గోదావరి నుండి వరద ఉధృతంగా వస్తోన్న నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో విస్తారంగా కురవడంతో పాటు గోదావరి నుండి వరద ఎక్కువగా వస్తుండటంతో కలెక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని,గోదావరి పరివాహక ప్రజలను అప్రమత్తం చేయాలని మంది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

## బీఆర్ఎస్ నేతలు గవర్నర్ ను ఆశ్రయించడం సిగ్గు చేటు : బీర్ల ఐలయ్య

**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర గవర్నర్□ను కలవడానికి సిగ్గుండాలని ఫైర్ అయ్యారు.. అసలు గవర్నర్ వ్యవస్థపై బీఆర్ఎస్ నాయకులకు నమ్మకం ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు అప్పటి గవర్నర్□ను అనేక విధాలుగా కేసీఆర్ అవమానించారని,అలాంటి బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రాజ్యాంగాన్ని రక్షించాలని గవర్నర్ ఆశ్రయించడం సిగ్గు చేటు అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో రాజ్యాంగంపై దాడి జరుగుతుందని బీఆర్ఎస్ నేతలంటున్నారు.. తెలంగాణలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాకుండా కల్వకుంట్ల రాజ్యాంగాన్ని అమలు చేసింది మీరు కాదా..? అని బీర్ల ఐలయ్య అన్నారు. రాజ్యాంగానికి ఏ మాత్రం విలువ ఇవ్వకుండా నియంతృత్వ పాలన చేసింది మీరు కాదా.. తెలంగాణలో రాజ్యాంగాన్ని ఖననం చేసింది కల్వకుంట్ల కుటుంబం కాదా..? అని ఆయన ప్రశ్నించారు. ఫిరాయింపులకు



పాల్పడుతున్నారని రాజ్ భవన్ ముందు కేటీఆర్ గొంతు చించుకుంటున్నారని , పది సంవత్సరాల పాటు ఆయన గొంతు ఎందుకు మూగబోయింది.. తెలంగాణలో ప్రతిపక్షాలే లేకుండా కేసీఆర్ చేయడానికి ప్రయత్నించినప్పుడు కేటీఆర్ మౌనవ్రతం పాటించారా..? అని ఆయన ప్రశ్నించారు.



## శంషాబాద్ లో భారీగా డ్రగ్స్ పట్టివేత..!

**విశ్వంభర, శంషాబాద్:** శంషాబాద్ లో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు అధికారులు.. రూ. 7 కోట్లు విలువ చేసే కేజీ హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ SOT, మాదాపూర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. రాజస్థాన్ నుండి హైదరాబాద్కు హెరాయిన్ తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంది అంతర్రాష్ట్ర ముఠా. రాజస్థాన్ కి చెందిన నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మీడియాకు వివరాలు వివరించారు. పెద్ద మొత్తంలో హెరాయన్ పట్టుబడటం ఇదే మొదటిసారి అన్నారు. మొత్తం ఒక కేజీ హెరాయిన్ స్వాధీనం చేసుకున్నాం.. దీని విలువ రూ. 7 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ సప్లై చేస్తున్న నేమిచంద్ భాటి, నార్పట్ సింగ్, అజయ్ భాటి, హరీష్ సిర్వి, సంతోష్ ఆచార్య అనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రాజస్థాన్ నుంచి డ్రగ్స్ బస్సులో తీసుకొచ్చారన్నారు. మరోవైపు.. ఆఫ్ఘనిస్తాన్ లోనే హెరాయిన్ ఎక్కువగా తయారు అవుతోందని సీపీ చెప్పారు. ఈ హెరాయిన్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు. స్వీట్ బాక్సుల్లో పైన స్వీట్స్ పెట్టి.. కింద 250గ్రా. హెరాయిన్ ఉంచి సరఫరా చేస్తున్నట్లు సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు.

## ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో రోగులను పట్టించుకోని వైద్యులు..!

**విశ్వంభర, ఖమ్మం:** సాధారణంగా ఎవరికైనా ఏ ఆపద వచ్చినా ఆసుపత్రికి వెళ్తుంటారు. తాజాగా ఆపద వచ్చిందని ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్ళితే ఓ మహిళ పై డ్యూటీ డాక్టర్లు వృత్తి ధర్మాన్ని మరిచి ముచ్చట్లు పెట్టుకుంటూ.. పేషేంట్ ను పట్టించుకోని సంఘటన జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో చోటు చేసుకుంది. బాధితులు తెలిసిన



వివరాల ప్రకారం ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బి.వెంకటమ్మ (70) కూలి పనిలో భాగంగా పొలంలో పనికి వెళితే పాము కాటు వేసింది. దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళితే ఓపి రాయడానికి సుమారు 15 నిమిషాలు.. ఆ తరువాత మళ్ళీ లోపలికి వెళితే టెస్టు చేయించుకొని రండి అంటూ ఆ తర్వాత ఫైల్ తీసుకొని రండి అంటూ టైం వేస్ట్ చేసిన ముగ్గురు డాక్టర్లు ఒకే చోట కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ జోకులు వేసుకుంటూ నవ్వుతున్నారని బాధిత మహిళ వాపోయింది. కనీసం పాము కరిచి నడవలేని స్థితిలో ఉన్న మహిళను కుర్చీలోంచి లేచి వచ్చి చూడరా మేడం అని అడిగితే అరవకండి అంటూ.. దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు పేషేంట్ తరపు బంధువుల పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు.

## పాలస్తీనాకు సంఘీభావంగా మన దేశం నిలబడాలి

**విశ్వంభర ,నాంపల్లి :** ప్రపంచంలో తన మాతృభూమి కోసం ఏండ్లుగా పోరాడుతున్న పాలస్తీనాకు సంఘీభావంగా మన దేశం నిలబడాలని టీజేఏస్ అధినేత ప్రొ. కోదండరాం అన్నారు. శనివారం నాంపల్లిలోని టీజేఏస్ పార్టీ కార్యాలయంలో టీజేఏస్ పార్టీ మరియు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో "సీజ్ ఫైర్ ఫ్రీ పాలస్తీన్" అనే అంశంపై మేధావుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి టీజేఏస్ పార్టీ నేతలు మహమ్మద్ అఫ్జల్, సలీమ్ పాషలు సమన్వయ కర్తలుగా వ్యవహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన ప్రొ. కోదండరాం మాట్లాడుతూ.. "మూడవ ప్రపంచ దేశాల హక్కుల కొరకు నేడు ఉద్యమించాల్సిన అవసరం ఉంది. 1948 నుండి ఇజ్రాయిల్ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తుంది. తమ మాతృభూమిని కాపాడుకోవడానికి పాలస్తీనియులు పోరాడుతున్నారు. నెహ్రూ కాలం నుండి ఇందిరా గాంధీ కాలం వరకు మన దేశం పాలస్తీనాకు పూర్తి సంఘీభావంగా నిలిచింది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ప్రకారం కేంద్ర పాలకులు ప్రపంచ శాంతి కోసం కూడా కృషి చేయాల్సి ఉంటుంది. దీనిని ప్రస్తుత పాలకులు




గమనించాలి. మానవత్వ కోణంలో ఆలోచించి ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న దురాక్రమణకు వ్యతిరేక వైఖరిని మన దేశం తీసుకోవాలి. ప్రపంచ శాంతికి మన వంతు పాత్ర నిర్వహించాలి" అన్నారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ.. "గత పది నెలలుగా ఇజ్రాయిల్ పాలస్తీనా మీద దాడులు చేస్తుంది. ఇది యుద్ధం కాదు. మన కళ్ల ముందు జరుగుతున్న మారణహోమం. లండన్ నుండి వెలువడుతున్న లానెట్ అనే రిసెర్చ్ పత్రిక ప్రకారం ఇప్పటి వరకు 1, 86, 000 Asks పాలస్తీనీయులు ఈ మారణహోమంలో మరణించారని సమాచారం అందుతుంది" అని అన్నారు. నిజాం కాలేజీ లెక్చరర్ డా. జానకి రెడ్డి మాట్లాడుతూ.. "ఇది రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కాదు. పాలస్తీన ప్రజలు తమ మాతృభూమి కోసం చేస్తున్న సంఘర్షణ. గత పది నెలలుగా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి ఇజ్రాయిల్ దాడులు చేస్తుంది. ఇజ్రాయెల్ కి మారణాయుధాలు అమెరికా సప్లయ్ చేస్తుంది. ఐక్య రాజ్య సమితిని కూడా అమెరికా తన గుత్తాధిపత్యంలో ఉంచుకుంది. ప్రస్తుతం యూఏన్వో అమెరికా చేతిలో ఒక ఆటబొమ్మగా మారింది. ఈ సమయంలో పాలస్తీనాకు మన దేశం సంఘీభావంగా నిలబడాలి" అని అన్నారు. ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడుతూ.. "ఇజ్రాయిల్ చేస్తున్నది జంగ్ కాదు.. ఒక జెనోసైడ్. యూఏన్వోలో ఇప్పటి వరకు ఇజ్రాయిల్ కి వ్యతిరేకంగా 300 తీర్మానాలు వచ్చాయి. అయినా ఇజ్రాయిల్ ఉన్మాదంగా వ్యవహరిస్తుంది. ఇకనైనా ప్రపంచ దేశాలు పాలస్తీనా గురించి ఆలోచన చేయాలి. లేకపోతే ప్రపంచంలో మాతృభూమి లేని దేశంగా పాలస్తీనా మన కళ్ల ముందు నిలుస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సారా మాథ్యూస్, డా. ఇస్లాముద్దీన్ అస్గర్, సనా ఉల్లా ఖాన్, మౌలానా సూఫీ ఖైరుద్దీన్, మౌలానా సుత్తారి అద్వకేట్ షకీల్, టీజేఏస్ నాయకులు ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.






www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
21-07-2024
సంపుటి : 01 | సంచిక : 78 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## ఆధార్ కార్డుల లోపంతోనే

# డబ్బులు జమ కాలేదు

రూ.లక్షలోపు రుణమాఫీ కానీ రైతులు కంగారు పడొద్దు

రెండో విడతలో ఇప్పుడు పడని వారందరికీ జమ

ఇప్పటికే ఆర్బీఐలో డబ్బులు చెల్లించి లిస్ట్ ఇచ్చాం

ఆగస్ట్ 15 నాటికి రూ.2లక్షల రుణమాఫీ పూర్తి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తోంది. ఈ నెల 18వ తేదీ నుండి రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోన్న ప్రభుత్వం.. ఫస్ట్ ఫేజ్లో భాగంగా లక్ష లోపు పంట లోన్ ఉన్న రైతులకు మాఫీ చేసింది. ఈ నెల చివరి వరకు లక్షన్నర, ఆగస్ట్ 15 నాటికి రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, తొలి విడతలో లక్ష లోపు రుణం ఉన్నప్పటికీ కొందరు మిగతా5లో...



తెలంగాణలో జ్యాబ్ క్యాలెండర్ లొల్లి షురూ అయింది. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఈ వ్యవహారంలోనే మాట యుద్ధం కూడా జరుగుతోంది. జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యువతను మోసం చేసిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి రావడానికి ముందు వరకు నిరుద్యోగులకు న్యాయం చేస్తామని, సమయానికి ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేసే జాబ్ కాలెండర్ విడుదల చేస్తామని కబుర్లు చెప్పిన కాంగ్రెస్ తీరా అధికారం రావడంతో ప్రజలకు ఇచ్చిన మాటలను విస్మరించిందంటూ కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ నిరుద్యోగులకు అండగా బీజేపీ ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు వారి పోరాటంతో తాము సహకరిస్తామని కిషన్ రెడ్డి చెప్పారు.

# రేవంత్ రెడ్డి V/S కిషన్ రెడ్డి

## జాబ్ క్యాలెండర్‌పై కాంగ్రెస్,బీజేపీ లొల్లి లొల్లి

- ప్రభుత్వ శాఖల్లోని అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం
- నిరుద్యోగుల బాధలు నాకు బాగా తెలుసు
- త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఆరు నెలల్లోనే నియామకాలు భర్తీ
- సివిల్స్ ఔత్సాహికులతో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- గంటల వ్యవధిలోనే సీఎం కామెంట్స్‌కు కిషన్ రెడ్డి కౌంటర్
- నిరుద్యోగులను అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్
- నిరుద్యోగ భృతి ఇస్తామంటూ హామీ ఇచ్చి మొండిచెయ్యి
- గ్రూప్ 2 ఉద్యోగాలు 2 వేలకు, గ్రూప్ 3 ఉద్యోగాలు 3వేలకు పెంచాలి
- ధర్నా చౌక్‌లో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :**

శనివారం ప్రజాభవన్‌లో సివిల్స్ ఔత్సాహికులతో నిర్వహించిన ముఖాముఖీలో జాబ్ క్యాలెండర్‌పై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగుల బాధలు తమకు బాగా తెలుసని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగులకు తమ ప్రభుత్వం అడుగడుగునా సహకరిస్తామని రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేసేలా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని, ఆ దిశగా ప్రణాళికలు కూడా రూపొందిస్తున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదల చేసిన ఆరు నెలల్లో ఉద్యోగుల నియామకాలు పూర్తయ్యేలా జాబ్ క్యాలెండర్‌లను రూపొందిస్తామని మాటిచ్చారు. నోటిఫికేషన్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని, నియామకాలు పూర్తి చేస్తామని చెప్పారు.

**జాబ్ క్యాలెండర్ కిషన్ రెడ్డి కౌంటర్**

రేవంత్ ఈ వ్యాఖ్యలు చేసిన గంటల వ్యవధిలోనే కాంగ్రెస్ సర్కార్ జాబ్ క్యాలెండర్‌ను మరిచిపోయిందంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా ఉంది. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా5లో...

## యూపీఐ పేమెంట్లకు ఎనలేని ఆదరణ

- ప్రతి నెలా జత కలుస్తున్న 60 లక్షల మంది నూతన యూపీఐ చెల్లింపుదార్లు
- ఏడాది ప్రాతిపదికన 49 శాతం మేర పెరిగిన పేమెంట్లు
- రోజువారీగా యూపీఐ చెల్లింపుల మొత్తం విలువ రూ.66,903 కోట్లు
- గణాంకాలు విడుదల చేసిన ఎన్‌పీసీఐ




11

## కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు

- ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చి రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృథా
- తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే ఖర్చు చాలా తగ్గేది
- ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో మరో చోటుకు మార్చారు
- కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కుంగిపోయింది
- ఢిల్లీలో మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



5

## చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్

- 30 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం
- 8 క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, 22 టెక్స్‌టైల్ డిజైనర్ ఉద్యోగాలు

5

## రాజకీయాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్



- ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారు
- తెలంగాణలో కుల వివక్ష ఉండదు..
- మా కులాలను అభిమానిస్తాం, ఇతర కులాలను గౌరవిస్తాం
- అభివృద్ధిలో కమ్మ సామాజికవర్గం భాగస్వాములు కావాలి
- కమ్మ గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్

**విశ్వంభర, హైదరాబాద్ :** కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారి అభివృద్ధికి పాటుపడే నాయకత్వం కావాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో శనివారం జరిగిన కమ్మ గ్లోబల్ సమ్మిట్ లో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిలో కమ్మ సామాజికవర్గం భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో మిగతా5లో...

### సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన వారి కోసం కొత్త పథకం

- 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించిన సీఎం
- సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులకు ఆర్థిక సాయం కోసం పథకం
- సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయం

5

## కాంగ్రెస్ కుట్రలు వరదలో కొట్టుకుపోయాయి

### కాళేశ్వరం ప్రాజెక్ట్ గర్వంగా తలెత్తుకుని ఉంది



- ఇంతటి వరదల్లో కూడా కేసీఆర్ సంకల్పం సలాం కొడుతోంది
- బురదరాజకీయాలను ఈ వరదలు భూస్థాపితం చేశాయి
- కాళేశ్వరమే తెలంగాణ కరువును పారదోలే కల్పతరువు
- కాంగ్రెస్ విమర్శలపై కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్

5

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 184 | ₹ 210 |

## 'భలే అందంగా ఉన్నావ్.. చెప్పినచోటికి వస్తావా..'

- ఫిర్యాదు చేయడానికి వచ్చిన లేడీతో సీఐ వికృత చాటింగ్
- మహిళ ఫోన్ నంబర్ తీసుకుని అసభ్యకర మెసేజ్‌లు
- తప్పని వారించినా పట్టించుకోని సనత్‌నగర్ సీఐ
- ఆధారాలతో సహా సైబరాబాద్ సీపీకి మహిళా ఫిర్యాదు
- హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు



**విశ్వంభర, సనత్ నగర్:** ఓ సమస్య గురించి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చింది ఆ లేడీ. ఈ క్రమంలో ఆమె నంబర్ తీసుకున్న అక్కడి ఇన్‌స్పెక్టర్ ఆమెకు అసభ్య మెసేజ్‌లు చేశాడు. దీంతో బాధితురాలు సీపీకి కంప్లైంట్ చేయడంతో అతని ఉద్యోగానికి ఎసరు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మిగతా5లో...




5

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి

- కట్ట మీది నుంచి నీళ్లు పొంగిపొర్లుతుంటే ఎందుకు ఆలస్యం చేశారు?
- ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటి
- ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే రూ.100 కోట్ల నష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర ఆగ్రహం

## తెలంగాణలో మారిన పాఠశాలల టైమింగ్స్

- ఉదయం 9:00 నుంచి 4:15 గంటల వరకు మార్పు
- హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో ఉదయం 8:45 నుంచి 4:00 గంటల వరకు
- ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో వెసలుబాటు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

5



# పత్తి కంపెనీల ఆర్గనైజర్ల దోపిడిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానికి లేదా!



వ్యవసాయమే భారతీయుల ప్రధాన వృత్తి. పంట భూములు ఉన్న రైతులు, వ్యవసాయ పనులే జీవనోపాధిగా గల రైతు కూలీలే భారత జనాభాలో అత్యధికులు. సేద్యం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, ఒక జీవన విధానం. వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రతీ ఒక్కరు మాట్లాడుతున్నారు. అయినా అన్నదాతల అవస్థలకు అంతు లేదు. అన్నీ సమస్యలే, అనుక్షణమూ అనిశ్చితే. విత్తనాల అలభ్యత తొలి సమస్య. అవి లభ్యమైనా సకాలంలో అందుబాటులోకి రావు. ఎరువులూ అంతే. ఒక పక్క ఉత్పాదకాల వ్యయాలు కృంగదీస్తుంటే మరో పక్క ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడుతుంటాయి. అన్నిటినీ సహించి, భరించి రాజనాలు పండిస్తే వాటికి గిట్టుబాటు ధరలు లభించడం కనాకష్టం. ఇదొక ఎడతెగని విషాదం. పెట్టుబడులపై రాబడులు (రిటర్న్స్ ఆన్ ఇన్వెస్ట్ మెంట్) కనీసమాత్రంగా లేకపోవడం ఆ విషాదానికొక పరాకాష్ఠ. మరి వ్యవసాయరంగం దురవస్థలో కాకుండా మరెలా ఉంటుంది? ఈ కఠోర పరిస్థితులను రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోకపోవడం లేదు. ఇక సేద్యానికి అనువైన భూములు భారత్ లో విస్తారంగా ఉన్నాయి. ఖరీఫ్ లో 8.30 కోట్ల హెక్టార్లు, రబీలో 6.80 కోట్ల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. 2023 విత్తన మార్కెట్ విలువ దాదాపు రూ.23,000 కోట్లకు చేరినట్లు జాతీయ విత్తన పరిశ్రమల సమాఖ్య చెబుతోంది. వాటి అమ్మకాలు ఏటా పది శాతం చొప్పున వృద్ధి చెందు తున్నట్లు అంచనా. ప్రపంచ విత్తన విపణిలో భారత్ అయిదో స్థానాన్ని ఆక్రమిస్తోంది. కానీ, నాణ్యమైన విత్తనాలు దొరకడం గగనమే అవుతోంది. దానివల్ల దేశార్థికం తీవ్రంగా నష్టపోతోందని అనేక సర్వేలు హెచ్చరిస్తున్నాయి. దేశంలో ఊరూ పేరూ లేని విత్తన బ్రాండ్లు వేల సంఖ్యలో చలామణీ అవుతున్నాయి. నిరుడు అనధికారిక విత్తన మార్కెట్ ద్వారా సుమారు రూ. 6,000 కోట్ల మేర విక్రయాలు సాగాయంటున్నారు. ప్రధాన వాణిజ్య పంటల సాగులో 65 శాతం వరకు నాసిరకం, కల్తీ విత్తనాలను వినియోగిస్తున్నట్లు అంతర్జాతీయ విత్తన సమాఖ్య లోగడ వెల్లడించింది. రైతులను నిలువునా దగా చేస్తూ వారి ఆత్మ హత్యలకు కారణమవుతున్న నకిలీ, నాసిరకం విత్తనాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతున్నది. ఫలితంగా కావలిసిన నాణ్యమైన విత్తనాలు లభించక అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈసారి ఒకపక్క వాతావరణ శాఖ అంచనాల కంటే ముందుగానే నైరుతీ రుతు పవనాలు తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించాయి. దీంతో రైతులు సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహా రక మందులు లాంటి వాటి కొరకు క్యూలు కడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ను దృష్టిలో ఉంచుకొని ఈసారి పత్తికి మంచి ధర వస్తుందనే అంచనాలతో తెలంగాణలో భారీ ఎత్తున పత్తి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. అయితే ఇందుకు అనుగుణంగా విత్తనాలు సరఫరా చేయడంలో అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పని చేయలేకపోతున్నది. నకిలీ, నాసిరకం విత్తనాలను సరఫరా చేసి రైతులను మోసం చేసే వారిని ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేదిలేదని పీడీ చట్టాన్ని ప్రయోగించి కటకటాల వెనక్కి పంపేందుకు కూడా వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నా ఈ నకిలీ విత్తన వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. ఈ యేడాది తెలంగాణలో వానాకాలం కోటి ముప్పై నాలుగు లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి, పత్తి, మొక్కజొన్న, సోయా బీన్, కంది, పెసర్లు లాంటి పంటలను సాగు చేయాలని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. రైతులకు ఇందుకు అవసరమైన విత్తనాల సరఫరా చేయాలని నిర్ణయించింది. గత యేడాది దాదాపు నలభై ఐదు లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా, ఈసారి దాన్ని యాభై ఆరు లక్షల వరకు విస్తరించాలని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇందుకు సరిపడ విత్తనాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అయితే రైతులు కొన్ని కంపెనీల బ్రాండ్ ఉన్న విత్తనాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ కొరత ఏర్పడుతున్నదని ప్రభుత్వమే సరఫరా చేస్తున్నా మిగిలిన కంపెనీల విత్తనాలు రైతులు కొనుగోలు చేయడానికి ఇష్టపడకపోవడంతో సమస్య వస్తున్నదని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. మొత్తం మీద విత్తనాల కొరతను ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాల వ్యాపారులు విజృంభిస్తున్నారు. ఈ సీజన్లో ఇప్పటికే దాదాపు రెండున్నర కోట్ల రూపాయల విలువైన నకిలీ పత్తి విత్తనాలు టాస్కోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. ఈ సందర్భంగా సుమారు గతంలో ముప్పైమూడు మందికిపైగా అరెస్టుచేశారు. ప్రతి యేడాది ఇలాగే పెద్దఎత్తున నకిలీ విత్తనాలు సరఫరా చేసే వ్యాపా రులు పట్టుబడుతూనే ఉన్నారు, కేసులు పెడుతూనే ఉన్నా రు. కఠినమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల చట్టాల్లో ఉన్న లొసుగులను చూసుకొని బయటపడుతున్నారు. అనేది నగ్నసత్యం. ఇక అసలు విషయానికి వద్దాం.

పత్తి విత్తన సాగుపేరిట ఆర్గనైజర్లు, కంపెనీలు రైతులను దోపిడీచేస్తున్నాయి. కంపెనీలు, వాటికి దళారులుగా వ్యవహరించే ఆర్గనైజర్ల చేతుల్లో విత్తన రైతులు విలవిల్లాడుతున్నారు. పెట్టుబడి కింద అప్పులు ఇవ్వడం నుండి వాటికి అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, లెక్కలు తేల్చకుండా రైతులను నిండా ముంచుతున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 228 కోట్ల ప్యాకెట్ల పత్తి విత్తనోత్పత్తి జరుగుతున్నట్లు అంచనా. దాదాపు 27 కంపెనీలు విత్తన పత్తిని రైతులతో సాగు చేయిస్తున్నాయి. దేశంలోనే విత్తన పత్తి అత్యధికంగా సాగయ్యే గద్వాల జిల్లాతో పాటు, తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్నగర్ తదితర పలు జిల్లాలు ఉన్నాయి. దేశానికి అవసరమైన పత్తి విత్తనాల్లో 60 శాతం విత్తనం తెలంగాణ రాష్ట్రం నుండే సాగు అవుతోందని వ్యవసాయశాఖ అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. పత్తి విత్తనాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 430 విత్తన కంపెనీలు, వితనోత్పత్తి, ప్రాసెసింగ్, గ్రేడింగ్, స్టోరేజ్ చేపడుతున్నాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే విత్తన పత్తిలో రాష్ట్రం వాటా ప్రధానంగా గద్వాల జిల్లా వాటా సుమారు 30 శాతంగా ఉంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో 41 వేల ఎకరాల్లో పత్తి విత్తనోత్పతి జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గద్వాల తదితర జిల్లాల్లో దాదాపు లక్ష మందికిపైగా రైతులు, కూలీలు, ఆర్గనైజర్లు, కంపెనీల్లో సిబ్బంది విత్తన పత్తినే ఆధారంగా పనిచేస్తున్నారు. దశాబ్దాలుగా పలు ప్రాంతాల రైతులు విత్తన పత్తిపైనే ఆధారపడి ఉన్నారు. కాగా రాష్ట్రంలో జూన్, జూలై నెలలో విత్తన పత్తిసాగు మొదలవుతుంది. విత్తన పత్తి సాగు చేసే రైతులకు పెట్టుబడుల నిమిత్తం సంబంధిత కంపెనీలే సుమారు 22 శాతం వడ్డీతో అప్పులు ఇస్తాయి. కానీ కంపెనీకి, రైతులకు మధ్య ఆర్గనైజర్లు పెట్టుబడులపై వడ్డీలు వసూలు చేస్తారు. ఇందుకు ఎలాంటి చట్టబద్ధమైన ఒప్పంద పత్రాలు ఉండవు. మనీ లాండరింగ్ చట్టం ప్రకారం ఇది నిబంధనలకు విరుద్ధమని అధికారులకు తెలిసినా పట్టించుకునే పరిస్థితి ఉండడంలేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. జూన్ ఒకటిరెండు నెలల ముందే ఆర్గనైజర్లు రైతులకు పెట్టుబడి పేరు మీద

అప్పులు ఇవ్వడం సర్వసాధారణంగా జరుగుతుంది. అప్పటినుండచే వాటికి వడ్డీని లెక్కగడతారు. నవంబర్, డిసెంబర్ నెలలనాటికి పంట చేతికి వస్తుంది. రైతులు ఆ విత్తన పంటను ఆర్గనైజర్లకు అప్పగిస్తారు. అప్పటి వరకే వడ్డీ వసూలు చేయాలి. పెట్టుబడి పెట్టిన కంపెనీ కూడా ఆర్గనైజర్ల నుండి అప్పటి వరకే వడ్డీని వసూలు చేస్తుంది. కానీ ఆర్గనైజర్లు మాత్రం మళ్లీ సీజన్ ప్రారంభం అయ్యేంత వరకూ విత్తన ఉత్పత్తి లెక్కలు తేల్చకుండా నాన్చుతారు. ఈ విధంగా నెలల తరబడి తేల్చకుండా రైతుల వద్ద భారీగా వడ్డీలను ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. దీంతో విత్తన వంటతో అంతో ఇంతో వచ్చే ఆదాయం వడ్డీలకు జమచేసుకుని రైతులకు రిక్తహస్తాలు చూపడం ఏటా ఒక తంతులాజరుగుతోంది. మరోపక్క పత్తి విత్తన పంట ఉత్పత్తిని అప్పగించిన తర్వాత కూడా ఆర్గనైజర్ల దోపిడీ యదేచ్ఛగా కొనసాగుతుంది. జిన్నింగ్ ఛార్జీలు కూడా రైతులనుండే వసూలు చేస్తారు. అంతేకాకుండా తూకంలోనూ చేతివాటం చూపిస్తారు. క్వింటాలుకు 7 నుంచి 15 కిలోల చొప్పున తరుగు కూడా తీస్తారు. వేరు చేసిన విత్తనాన్ని శుద్ధి చేసిన అనంతరం నాణ్యమైన విత్తనాలు తూకం వేసే సమయంలో మాత్రం కంపెనీలు రైతులను తప్పనిసరిగా పిలుస్తాయి. వారి ముందేతూకం వేసి, రశీదు ఇచ్చి పంపుతాయి. మళ్లీ అక్కడ కూడా ఆర్గనైజర్లు ప్రవేశం చేసి దోపిడీకి తెరలేపుతారు. శుద్ధి చేసిన విత్తనాల్లోపనికి రాకుండా పోయిన విత్తనాలు నాసిరకం విత్తనాలు మొత్తం ప్యాకెట్ల నుండి 1020 శాతం వరకూ కోత కోస్తారు. అలాగే తరుగు పోగా వచ్చినవిత్తన ప్యాకెట్లకు రైతులకు ధరలను లెక్కకడతారు. ఒక్కో ప్యాకెట్కు 450 రూపాయల నుండి 490 రూపాయల వరకూ విత్తన రైతులకు ఇచ్చేందుకు మొత్తం సొమ్మును కంపెనీలు ఆర్గనైజర్లకు ఇస్తాయి. కానీ ఆర్గనైజర్లు మాత్రం రైతులకు గరిష్ఠంగా 320 రూపాయల నుంచి 410 రూపాయలను చెల్లిస్తున్నారు. గత ఏడాది ధరలు పెంచాలని రైతులు డిమాండ్ చేసినా ఆర్గనైజర్లు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. రైతులకు ఇచ్చే రేటు విషయంలో కూడా ఆర్గనైజర్లు

అడ్డంగా వ్యవహరిస్తుంటారు. క్వింటా ధరలను కాటన్ మిల్లుల వద్ద ప్రదర్శించాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు జరగడం లేదు. కానీ ఆర్గనైజర్లు సీజన్లో కనిష్ఠంగా ఏ రేటు ఉంటుందో అంతే చెల్లించి రైతులను అడ్డంగా దోచుకుంటారు. కాగా సాగుకు ముందే రైతుకు కంపెనీకి, రైతులకు ఆర్గనైజర్లకు మధ్య ఒప్పందాలు జరగాలి. పెట్టుబడి రుణం, వడ్డీ రేటు, విత్తన ప్యాకెట్ ధరతో సహా అన్ని అంశాలను ఆ ఒప్పందంలో విధిగా పేర్కొనాల్సి ఉంటుంది. ప్రతీ లావాదేవీకి అధికారిక రశీదు ఉండాలి. బడి ఈడు పిల్లలను కూలీలుగా ఉపయోగించుకోబోమంటూ ఒప్పంద పత్రంలో చేర్చాల్సి ఉంది. అసలు ఏ కంపెనీ ఏ రైతుతో ఎంత పత్తి సాగు చేస్తోంది. ఎన్ని విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయి అనే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలి. అయితే ఇవేమీ ఎక్కడా అమలు కావడం లేదు. గత ఏడాది కేవలం నాలుగు కంపెనీలు మాత్రమే వివరాలు ఇవ్వగా మిగిలిన కంపెనీలు ఎటుంటి సమాచారం అందించ లేదు. ఒక్క గద్వాల జిల్లాలో వితన పత్తిపై ఏటా సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేర వ్యాపారం జరుగుతుందని అధికారిక అంచనా. ఇందులో ఆర్గనైజర్లు,

కంపెనీలు లాభపడుతున్నాయే తప్ప రైతులకు లాభం వచ్చిన సందర్భాలు కనిపించడం లేదు. విత్తన సాగును అడ్డం పెట్టుకుని ఆర్గనైజర్లు మాత్రం లాభాలపై లాభాలు సంపాదిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక ఎమ్మెల్యే. ఎంపీ. రాజకీయ నాయకులను శాసించే స్థాయిలో విత్తన కంపెనీలతోపాటు ఆర్గనైజర్లు ఉంటున్నారంటే ఎంత దోపిడీ జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ప్రభుత్వం పైన ఉంది. ఇక బడా రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతూ వాళ్ళకు అడుగులకు మడుగులు ఒత్తుతో పేద రైతులను దగా చేస్తున్నారు అనేది నగ్నసత్యం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగు చర్యలు తీసుకోవాలని పత్తి రైతులను కాపాడాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.



- మన్నారం నాగరాజు,
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు,
95508 44433.

# వంద రూపాయల నోటు గురించి తెలుసా మీకు??

## తెలుసుకుందాం ఇప్పుడు




నిత్యం మన చేతుల మీదుగా ఎంతో డబ్బు చేతులు మారుతుంది. అందులో నాణెములలో అయితే 1 రూపాయి, 2 రూపాయలు, 5, 10 మరియు 20 రూపాయల నాణెములు, నోట్లు అయితే 1 రూపాయి, 5 రూపాయలు, 10, 20, 50, 100 మరియు 500 రూపాయల నోట్లు మన చేతుల్లో తిరుగు చున్నవి. అంటే ప్రస్తుతం వాడుకలో ఉన్నాయి. గతములో 2,000 రూపాయలు, 1000 రూపాయల నోట్లు వాడకులో ఉండేవికాని ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ప్రతి నోటుకు, ప్రతి నాణెముకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇందులో వందరూపాయల నోటు యొక్క ప్రత్యేకత గురించి చూద్దాం.

మన వందరూపాయల నోటుపై వెనుక ఉన్న బొమ్మ ను ఎప్పుడైనా గమనించారా.... మరొక్కసారి నోటును పరిశీలిస్తే మనకు దాని ప్రత్యేకత తెలుస్తుంది.

క్రొత్త వంద రూపాయల నోటుకు వెనుక వైపు ఉన్న ఈ చిత్రం పేరు "రాణీ కా వావ్". ఇది ఒక నీటి బావి. ఇది గుజరాత్ లోని పఠాన్ జిల్లాలో ఉంది. వంద రూపాయల నోటు మీదకు వచ్చే వరకు ఎవరికీ తెలియని ఈ అద్భుత నిర్మాణ విశేషాల గురించి తెలుసుకొని అందరికీ చెప్పడం వల్ల మన చరిత్ర ఎంత గొప్పదో ప్రస్తుత ప్రజలకు, చిన్నారులకు తెలిసే అవకాశం ఉంటుంది.

విశ్వవ్యాప్తంగా చాలా నిర్మాణాలు అలాగే మన దేశంలో ఉన్న చాలా నిర్మాణాలు రాజుల కొరకు, దేవుళ్ల కోసమో లేదా తమ రాణుల కోసమో కట్టించారు. కానీ "రాణీ కా వావ్" ను మాత్రం సోలంకి వంశానికి చెందిన రాణి ఉదయమతి తన భర్త భీమ 1 గుర్తుగా 10501100 మధ్య సరస్వతి నది ఒడ్డున నిర్మించింది.

మొత్తం 7 అంతస్థుల్లో నిర్మించిన ఈ బావి పొడవు దాదాపు 213 అడుగులు. వెడల్పు 66 అడుగులు, లోతు 92 అడుగులు. భారతదేశంలో మిగిలిన నిర్మాణాలన్ని నేల మీద నుండి పైకి అంతస్థులుగా నిర్మిస్తే దీన్ని మాత్రం భూమి లోపలికి 7 అంతస్థులుగా నిర్మించడం విశేషం. భూమి లోపలికి తవ్వుతూ నిర్మాణాలు చేయడం ఎంతో కష్ట మైనప్పటికి ఈ నిర్మాణం భారతీయుల ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఓ అద్భుత ఉదాహరణగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఈ నిర్మాణంలో మరో అద్భుత విషయం ఏమంటే కథలు చెక్కిన 215 స్థంభాలు, దాదాపు 800 శిల్పాలు వాటిపై నిర్మింప చేసి ఉన్నాయి. గోడల మీద దశావతారం కథలు, ఇతర పురాణాలు, స్త్రీల గురించి ఎన్నో బొమ్మలు చెక్కబడ్డాయి. ఈ బావిలో మరో అద్భుత విషయం దాగి ఉంది. బావి లోపలికి దిగిన కొద్ది ఉష్ణోగ్రత తగ్గి చల్లగా ఉంటుంది. 7 అంతస్తులు దిగిన తరువాత బావి ఉంటుంది. అప్పట్లో బావి చుట్టూ ఔషధ మొక్కలు కూడా పెంచారని అందుకే ఈ బావిలో స్నానం చేస్తే రోగాలు తగ్గేవని చరిత్ర వల్ల తెలుస్తుంది.

ఈ బావికి దగ్గర రహస్య మార్గాలున్నట్లు కనుగొన్నారు. బావి దగ్గరే ఓ బలమైన తలుపు మూయబడి ఉంటుంది. అప్పట్లో శత్రువులు దాడి చేసినపుడు ఆ తలుపు తెరిచి లోపల 30 కిలోమీటర్ల పొడవు ఉన్న సొరంగ మార్గంలో సిద్దాపూర్ అనే పట్టణానికి చేరే ఏర్పాటు చేశారని ఈ మార్గాన్ని అత్యవసర మార్గంగా ఉపయోగించడానికి నిర్మించారు. కానీ ఒకసారి సరస్వతి నదికి వచ్చిన వరదల్లో ఈ బావి పూర్తిగా ఇసుకలో కూరుకుపోయి కొన్ని సంవత్సరాల వరకు వెలుగు చూడలేదు. 1980లో ఆర్కీలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జరిపిన తవ్వకాల్లో ఇది బయటపడి మన దేశ గత వైభవాన్ని చాటి చెప్పింది.

2014లో యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ సంపద జాబితాలోకి చేర్చి దీని కీర్తి విశ్వవ్యాప్తం చేసింది. అయినప్పటికీ 2018 జులైలో రిజర్వ్ బ్యాంకు 100 రూపాయల నోటు మీద ముద్రించే వరకు చాలా మంది భారతీయులకు ఈ అద్భుత నిర్మాణం గురించి తెలియక పోవడం బాధాకరం.

ప్రతి నోటు పై ఉన్న చారిత్రక అంశాన్ని తెలియ చేయడం వల్ల మన వారసత్వ సంపద గురించి తెలుసుకున్న వారము అవుతాము. అలాగే మన వారసత్వ సంపదను ప్రపంచానికి తెలిపిన వారము అవుతాము.



- గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత.
9963499282
raghupatiraog@gmail.com

# అంగన్ వాడిల్లో 3వ తరగతి వరకే అంటే

## ప్రాథమిక పాఠశాలలకు మంగళం పాడినట్లే

- **అంగన్ వాడిలను కేజీ తరగతుల వరకే పరిమితం చేయాలి**
- **ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుండి 5 వ తరగతి వరకు కొనసాగించాలి**




గౌరవ ముఖ్యమంత్రి కొంతమంది విద్యవేత్తలతో నిర్వహించిన సమావేశంలో అంగన్ వాడి కేంద్రాలలో కేజీ నుండి 3 వ తరగతి వరకు బోధిస్తామని, సెమీ రెసిడెన్షియల్ విధానంలో 4 వ తరగతి నుండి 10 వ తరగతి స్కూల్స్ నడుపుతామని అన్నట్లు ఈ రోజు అన్ని దినపత్రికలలో వచ్చింది. ప్రభుత్వ పాఠశాల్లో కేజి తరగతులు లేని కారణంగా ఎన్రోల్ మెంట్ తగ్గుతున్నది. అందుకే మూడు నుండి ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపుచున్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రయివేటికరించి, తన సామాజిక బాధ్యత నుండి తప్పుకునే క్రమములో తీసుక వచ్చిన నూతన విద్యా విధానంలో కేజీ నుండి 1, 2 తరగతులను అంగన్ వాడీల్లో నిర్వహిస్తామని స్పష్టం చేసింది. మరి నిన్న ముఖ్యమంత్రి ప్రకటన కూడా నూతన విద్యా విధానం బాటలోనే 3 వ, తరగతి వరకు అంగన్ వాడిల్లో నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు ఉన్న విధంగానే 1 నుండి 5 వరకు ప్రాథమిక విద్య, 6 నుండి 10 వరకు ఉన్నత విద్యా విధానాన్ని(10+2 సిస్టం) కొనసాగించాలి. తొందరపడి నిర్ణయం తీసుకోకుండా ఇంకా మేధావులూ, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు, యువజన విద్యార్థి రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకొని ఒక నిర్ణయానికి రావాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. రఘునందన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు కూడా పారిశుధ్య కార్మికులను నియమించలేదని, గత ప్రభుత్వం పారిశుధ్యం బాధ్యత గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగిస్తే ఎక్కడ కూడా పనిజరగడం లేదనీ, మునుపు ఉన్నట్లు గానే స్థానికంగా పారిశుధ్య కార్మికులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నియమించుకొనుటకు నిధులు విడుదల చేయాలనీ కోరుతున్నాము.



- ఇ.రఘునందన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
బాలల హక్కుల సంక్షేమ సంఘం.
9866102962

## కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు

**విశ్వంభర, ఢిల్లీ :** కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే మేడిగడ్డ కుంగిపోయిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తాజాగా ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. తుమ్మిడి హట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో మరో చోటుకు మార్చారని పేర్కొన్నారు. ఎక్కువ వడ్డీకి రుణాలు తీసుకు వచ్చి రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేశారని విమర్శించారు. మేడిగడ్డ ఫౌండేషన్ ఆరు అడుగులు కుంగిపోయింది. కేసీఆర్, కేటీఆర్ కంటే మేధావులతో తాము ప్రాజెక్టు మరమ్మత్తు పనులు చేపడుతున్నామని తెలిపారు. సోమవారం అధికారులతో సమావేశంలో పలు కీలక విషయాలను వెల్లడించనున్నట్టు తెలిపారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ కి తమ ప్రభుత్వం ఖర్చు చేయలేదని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే.. ఖర్చు చాలా తక్కువగా వచ్చేదని తెలిపారు.

## చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్

**విశ్వంభర, హైదరాబాద్ :** చేనేత, జౌళిశాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. మొత్తం 30 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ వెల్లడించారు. వాటిలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 8, టెక్స్‌టైల్ డిజైనర్ ఉద్యోగాలు 22 ఉన్నట్టు పేర్కొన్నారు. ఐఐహెచ్‌టీ నుంచి చేనేత టెక్నాలజీలో డిప్లొమో చేసిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని , ఎంపికైన అభ్యర్థులు తాత్కాలిక పద్ధతిన మూడు సంవత్సరాల పాటు పనిచేయాల్సి ఉంటుందని శైలజారామయ్యర్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో మారిన పాఠశాలల టైమింగ్స్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో స్కూల్ టైమింగ్స్ మారాయి. రాష్ట్రంలో పాఠశాలల వేళలను మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మారిన స్కూల్ టైమింగ్స్ పై విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల స్కూల్ సమయాల్లో మార్పు చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. విద్యాశాఖ తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఉన్నత పాఠశాలు వేళలను ఉదయం 9:30 నుంచి 9:00 గంటలకు మార్చారు. అదే విధంగా ప్రతిరోజూ సాయంత్రం 4:45 గంటలకు బదులుగా 4:15 గంటలకు స్కూల్ పని పనివేళలు పూర్తవుతాయని ఉత్తర్వుల లో పేర్కొన్నారు. అయితే ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో ప్రస్తుతం అమలు అవుతున్న పని వేళలు కొనసాగుతాయని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ లలో ఉదయం 8:45కు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ప్రారంభం కాగా, సాయంత్రం 4 గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి.

## ఉద్యమం సమయంలో ఉన్న పరిస్థితులు పునరావృత్తం

- విద్యార్థులపై అప్రజాస్వామికంగా దాడులు చేసి, కేసులు పెట్టారు
- జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు
- అన్యాయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు
- పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌ను కలిసిన కేటీఆర్, హరీశ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై బీఆర్ఎస్ బృందం తెలంగాణ గవర్నర్‌ను కలిసి, వినతి పత్రం ఇచ్చింది. గవర్నర్‌ను కలిసిన వారిలో కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... నిరసన తెలుపుతున్న విద్యార్థుల పై అప్రజాస్వామికంగా దాడులు చేశారని, కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమం సమయంలో తెలంగాణలో ఎలాంటి పరిస్థితులు ఉండేవో... ఇప్పుడూ అలాగే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీశారు. గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. అన్యాయంగా తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ధ్వజమెత్తారు.

## ఐఐటీ అంటే రైట్ ఆఫ్ ఇండియా.. నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

**విశ్వంభర, సంగారెడ్డి:** ఐఐటీలు అంటే రైట్ ఆఫ్ ఇండియాగా మారిందని, ఇక్కడ చదివే విద్యార్థులు, రీసర్స్ బృందం దేశ పురోగతికి ఎంతో సహకారాన్ని అందించాయని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం కొనియాడారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది మండలం ఐఐటీ హైదరాబాద్లో 13వ స్నాతకోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 1100 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో డిగ్రీ సర్టిఫికెట్లను అందుకున్నారు. వారిని ఉద్దేశించి సుబ్రహ్మణ్యం మాట్లాడారు.విజయాలు మనం తీసుకునే పట్టా సర్టిఫికేట్ లో ఉండదని, మనం సమాజానికి ఇచ్చే సమకారంలో చూపుతోందని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని.. కోవిడ్ వంటి విపత్కరమైన సందర్భాల్లో ఐఐటీ విద్యార్థులు, రీసెర్చ్ బృందం అందించిన తమ సమకారాన్ని ఎన్నడూ దేశం మరిచిపోదని కొనియాడారు. వికసిత్ భారత్ లో భాగంగా 2024 నాటికి ప్రపంచంలోనే దేశ ఎకానమీ రెండో స్థానంలో నిలిచేలా ముందుకు అడుగులు వేస్తుందని చెప్పారు. ఎక్కడలేని విధంగా భారతదేశంలో 45 కోట్ల మంది విద్యార్థులకు 15 లక్షల మంది ఫ్యాకల్టీలు ఉండి ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలవడం, విద్యాభివృద్ధిలో దూసుకుపోవడం గొప్ప విషయం అన్నారు.




# రాజకీయాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్

**(మొదటి పేజీ తరువాయి)**

వివక్ష ఉండదని.. మా కులాలను అభిమానిస్తాం, ఇతర కులాలను గౌరవిస్తామని చెప్పారు. సమాజానికి సేవ సహజ గుణాన్ని మరవొద్దని కమ్మ సామాజిక వర్గాన్ని ఆయన కోరారు. రాజకీయాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్ అని, ఎంతో మందికి ఆయన అవకాశాలు ఇచ్చారని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలకు ఆయనే ఆద్యుడని గుర్తు చేశారు.

**కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు..**

"కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు.. అమ్మలాంటి ఆప్యాయత కలిగినవారు. కమ్మవారు నేలను నమ్ముకుని కష్టపడి పనిచేస్తారు. ఎక్కడ సారవంతమైన నేల ఉంటే అక్కడ కమ్మవారు కనిపిస్తారు. కష్టపడటం.. పదిమందికి సాయం చేయడం కమ్మవారి లక్షణం. కమ్మసామాజికవర్గం నన్ను ఎంతగానో అభిమానిస్తుంది. ఎన్టీఆర్ లైబ్రరీలో మేం చదువుకున్న చదువు.. మమ్మల్ని ఉన్నతస్థానంలో నిలబెట్టింది. నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారు. ఎన్టీఆర్ రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారు. దేశంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాల వల్లే ఇవాళ చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయి.హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు మీరు భాగస్వాములు కావాలి. మీలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాకు భేషజాలు లేవు.. మా కులాన్ని అభిమానిస్తాం.. ఇతర కులాలను గౌరవిస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదు.. అది మా ప్రభుత్వ విధానం కాదు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక హక్కు. నిరసన తెలపకుండా నియంత్రించాలనుకుంటే.. డిసెంబర్ 3న వచ్చిన ఫలితాలు ఎలా ఉంటాయో మీరు చూశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోంది. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని ప్రోత్సహించాలి. తెలుగువారైన వెంకయ్యనాయుడు రాష్ట్రపతి అవుతారని అంతా ఆశించామని, కానీ కాకపోవడం నిరాశ కలిగించిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒకప్పుడు ఢిల్లీలోనూ తెలుగువారి నాయకత్వం ఉండేదని.. ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మళ్లీ ఆ అలాంటి నాయకత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్ లైబ్రరీలో తాము చదువుకున్న చదువు ఇవాళ ఉన్నత స్థానాలకు రావటానికి ఉపయోగ పడిందని.. దీనిని గట్టిగా అందరి ముందు చెప్పడానికి ఏ మాత్రం భయపడనంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్జీ రంగా.. వెంకయ్య నాయుడు.. లాంటి నేతల పేర్లను చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి... ఈ నాడు.. చంద్రబాబు నాయుడు గురించి చెప్పాల్సిన అవసరమే లేదంటూ వివరించారు. వివాదంలో ఉన్న 5 ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తాం. భూసమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పదిమందికి సాయం చేసే మీ సహజ గుణాన్ని వీడొద్దని కోరుతున్నాన"ని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ప్రపంచ పర్యాటకులు సందర్శించేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు: రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించారు. దీంతో ఐటీ కారిడార్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లేవారికి ట్రాఫిక్



కష్టాలు తప్పుతాయి. నల్లగండ్ల, తెల్లాపూర్, చందానగర్, బీహెచ్ఈఎల్ ప్రాంతాలకు దీని మీదుగా వెళ్లవచ్చు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిని వేగంగా అభివృద్ధి చేసే బాధ్యతను తమ సర్కారు తీసుకుంటుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో సమస్యలకు పరిష్కారం చూపడానికి హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని గుర్తుచేశారు. మూసీని సుందరీకరిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేసి లక్షా 50వేల కోట్లతో పనులను ప్రారంభించుకోబోతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసుకోవడమే మన ముందున్న లక్ష్యమని తెలిపారు. మూసీ అంటే ప్రస్తుతం ముక్కు మూసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రపంచ పర్యాటకులు సందర్శించేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. మూసీ అభివృద్ధి చూడగానే ప్రజా ప్రభుత్వం గుర్తొచ్చేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. నగర అభివృద్ధిలో అందర భాగస్వాములు కావాలని అన్నారు. రాష్ట్రానికి 65 శాతం ఆదాయం జంట నగరాల నుంచే వస్తోందని చెప్పారు. హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

## సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన వారి కోసం కొత్త పథకం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించారు. సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ఈ కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరాం పాల్గొన్నారు. అంతకుముందు, సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డీఎస్సీ పరీక్షలు ముగియగానే గ్రూప్ 2, 3 పరీక్షలు నిర్వహిస్తే తమకు ప్రిపేర్ కావడానికి సమయం లేకుండా ఉంటుందని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని, దీంతో డిసెంబర్ నెలకు వాయిదా వేసినట్లు చెప్పారు. తెలంగాణ యువత ఆశలను నెరవేర్చుతున్నామని చెప్పడానికే తాను,





తన మంత్రులు.. కలిసి మీతో సమావేశమయ్యామన్నారు. సింగరేణి సంస్థ సహకారంతో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగుల బాధలు తమకు తెలుసునని... ఏళ్ల తరబడి వారు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నారన్నారు. అందుకే తాము అధికారంలోకి రాగానే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చినట్లు చెప్పారు. టీజీపీఎస్‌ను పునర్వ్యవస్థీకరించినట్లు చెప్పారు. పరీక్షలు మాటిమాటికి వాయిదా వేయడం సరికాదన్నారు.

## కాంగ్రెస్ కుట్రలు వరదలో కొట్టుకుపోయాయి

**విశ్వంభర, హైదరాబాద్:** 'తెలంగాణ నీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ తీవ్ర అవినీతికి పాల్పడింది. బీఆర్ఎస్ చేసిన అవినీతి, అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. కాళేశ్వరం అంటూ రాష్ట్ర ప్రజలను నిండా ముంచింది' అంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. నీటిపారుదల ప్రాజెక్టులపై అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేసింది కాంగ్రెస్ సర్కార్. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఇంతలో బీఆర్ఎస్ నేతలు ఒకరి తర్వాత ఒకరుగా కాంగ్రెస్ గూటికి చేరుతుండటంతో ఈ రెండు పార్టీల మధ్య వైరం మరింత పెరిగింది. అయితే అప్పట్లో నీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పుడు కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలతో నదులన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పరిస్థితులు వరదలను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ అవినీతి చేసిందంటూ తమ పార్టీపై బురద జల్లాడికి కాంగ్రెస్ పన్నిన్న కుట్రలన్నీ కూడా ఇప్పుడు వస్తున్న గోదావరి వరదలో కొట్టుకుపోయాయని కేటీఆర్.. ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. దీంతో పాటుగా కాళేశ్వరం ప్రాజెక్ట్ వీడియోను కూడా షేర్ చేశారు. కాంగ్రెస్ కుట్రలన్నీ వరదల్లో కొట్టుకుపోగా తమ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం మాత్రం గర్వంగా తలెత్తుకుని ఉందన్నారు.

**పటాపంచలైన పన్నాగాలు**

వర్షాల వల్ల పోటెత్తిన వరదకు దుష్టశక్తులు పన్నిన పన్నాగాలే పటాపంచలయ్యాయన్నారు కేటీఆర్.



''ఇంతటి వరదల్లో కూడా కేసీఆర్ సంకల్పం(కాళేశ్వరం) సలాం కొడుతోంది. జల హారతి పడుతోంది. లక్షల క్యూసెక్కుల గంగా ప్రవాహంలో లక్షల కోట్ల రూపాయలు నాశనం చేశారన్న విమర్శలు కొట్టుకుపోయాయి. ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరన్న నోర్లు ఈరోజు మూగబోయాయి. ఇంతటి వరదల్లో కూడా మేడిగడ్డ బ్యారేజీ మాత్రం మెక్కవోని దీక్షతో నిలబడింది. కొండంత బలాన్ని ఈ బ్యారేజ్ చాటిచెబుతోంది. ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా, మోసాలు చేసినా దశాబ్దాల పాటు దగాపడ్డ తెలంగాణ నేలకు ఇప్పటికీ, ఎప్పటికీ మన రైతుల కష్టాలు తీర్చే 'మేటి'గడ్డ'' అని కేటీఆర్ అన్నారు. ''కాళేశ్వరమే తెలంగాణ కరువును పారదోలే కల్పతరువు. బురదరాజకీయాలను ఈ వరదలు భూస్థాపితం చేశాయి. మానవ నిర్మిత అద్భుతాన్ని సాధించిన కేసీఆర్‌కు తెలంగాణ సమాజం మరోసారి సెల్యూట్ చేస్తోంది'' అని కేటీఆర్ రాసుకొచ్చారు. ఇంతటి వర్షాలను, వరదలను తట్టుకుని కూడా మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయని బీఆర్ఎస్ పేర్కొంది. మేడిగడ్డ అంతా కుంగిపోయింది, కాళేశ్వరం కొట్టుకుపోయిందంటూ కాంగ్రెస్, వందల కొద్దీ యూట్యూబ్ ఛానెళ్లు నెలల పాటు చేసిన దుష్ప్రచారం అంతా కూడా ఈ వరదల్లో కొట్టుకుపోయిందని, కాంగ్రెస్ కుతంత్రాలను కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీరు మేడిగడ్డ దగ్గర ప్రవహిస్తుందని బీఆర్ఎస్ తెలిపింది. తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేక కాంగ్రెస్ ఎన్నో కుట్రలు పన్నిందని, వాళ్లు ఏం చేసినా కాళేశ్వరం ప్రాజెక్ట్ జీవధారగా నిలుస్తుందని, అలాంటి కాళేశ్వరంపై బురజల్లే ప్రయత్నం చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమని కేటీఆర్ మండిపడ్డారు.

# రేవంత్ రెడ్డి V/S కిషన్ రెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా మోసం చేస్తూ వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారాయన. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో చెప్పి తీరా అధికారం వచ్చిన తర్వాత మొండిచేయి చూపిందని విమర్శించారు.

**రాష్ట్రమంతా అవినీతే**

''అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తి కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుంది. కాంగ్రెస్ నాయకులు అందరూ కూడా ఎవరికి తోచినంత, దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రమంతటా అవినీతి తాండవిస్తోంది. వందరోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్.. బీఆర్ఎస్‌లో చేర్చుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తోంది. ఎవరినైతే ప్రజలు వద్దని ఓడించారో వారినే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుంటూ ప్రజల నిర్ణయాన్ని కాలరాస్తోంది'' అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

**అందుకోసమే బీజేపీ కృషి**

బీజేపీ ఎన్నడూ అధికారం కోసం పోరాడలేదని, కేవలం అధికారంలో ఉండి ప్రజల సమ్యలను పట్టించుకోని వారికి ప్రజావాణిని వినిపించడానికే బీజేపీ కృషి చేస్తుందని చెప్పుకొచ్చారు కిషన్ రెడ్డి. ఈ సందర్భంగానే గ్రూప్ 1 మెయిన్‌కు 1:50 నిష్పత్తిలో కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 2000కు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 1,365 గ్రూప్3 పోస్టులను మూడు వేలకు పెంచాలన్నారు. ఇచ్చిన హామీ మేరకే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు రూ.4వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి

**విశ్వంభర, హైదరాబాద్ :** అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టు గండిపడి, కట్టకొట్టుకు పోయిన ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిందని మండిపడ్డారు. రైతులు హెచ్చరించినప్పుడే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయి గేట్లు తెరిచి ఉంటే వంద కోట్ల రూపాయల నష్టం జరిగేది కాదన్నారు. కట్టమీద నుంచి నాలుగైదు గంటల పాటు నీళ్లు పొంగిపొర్లుతుంటే గేట్లు ఎత్తకుండా అధికారులు ఎందుకు ఆలస్యం చేశారన్నారు. మూడు గేట్లుంటే, రెండు గేట్లే ఎత్తడంలో ఆంతర్యం ఏమిటన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు బద్దలై.. గుమ్మడివల్లి గ్రామాన్ని ముంచేసి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం ప్రదర్శించి వందల మంది గిరిజన బిడ్డల ప్రాణాలు ఫణంగా పెట్టారని హరీశ్ రావు అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు తెలంగాణ భూ భాగంలోనే ఉన్నదని, పర్యవేక్షణ చేస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులేనని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు గండి పడటం వల్ల గుమ్మడివల్లి, రంగాపురం, కోయరంగాపురం, బుచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలతోపాటు, పశుసంపదకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు ఘటన ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని హరీశ్ రావు విమర్శించారు. రక్షించండని అధికారులకు ఫోన్ చేసినా కనీస స్పందన లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హెలికాప్టర్లు సరైన కాలంలో రాకంటే ఆ రోజు వరదలో చిక్కుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీరు దారుణమన్న హరీశ్ రావు, ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు రోజులైనా మంత్రులకు తీరిక దొరకలేదా అన్నారు. ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటని నిలదీశారు. ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు 25 వేల రూపాయలు చెల్లించి రైతులను ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం కింద ఎకరాకు 10 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చెయ్యాలని, పశువులు కోల్పోయిన రైతులకు ప్రకృతి వైపరిత్య నిధి నుండి ప్రభుత్వం వెంటనే సహాయం హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కారణాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## 'భలే అందంగా ఉన్నావ్.. చెప్పినచోటికి వస్తావా..'

**(మొదటి పేజీ తరువాయి)**

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీస్‌స్టేషన్ లో కంప్లైంట్ చేసిన మహిళతో ఇన్‌స్పెక్టర్ అసభ్య చాటింగ్ చేశాడు. బాధితురాలు ఇది తప్పని వారించినా పట్టించుకోకపోవడంతో సీఐ బాగోతాన్ని కమిషర్ ముందు ఏకరవు పెట్టింది. 'అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేసుకు రా' అంటూ అతడు పెట్టిన అసభ్య మెసెజ్‌ల తాలూకా ఆధారాలను కూడా అందజేసింది. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రవర్తనపై సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా మెలగాలని, తప్పుగా వ్యవహరిస్తే వేటు పడుతుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు. పోలీస్ శాఖ గౌరవానికి భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఆధార్ కార్డుల లోపంతోనే డబ్బులు జమ కాలేదు

**(మొదటి పేజీ తరువాయి)**

రైతులకు లోన్ మాఫీ కాలేదు. దీంతో ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ లోన్ లక్ష లోపే ఉన్నప్పటికీ ఎందుకు మాఫీ కాలేదని హైరానా పడుతున్నారు. ఈ క్రమంలో లక్షలోపు మాఫీ కానీ లోన్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక ప్రకటన చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్ష లోపు పంట రుణం ఉండి ఫస్ట్ ఫేజ్లో లోన్ మాఫీ కానీ రైతులకు పది రోజుల్లో రుణమాఫీ అవుతోందని స్పష్టం చేశారు. సెకండ్ ఫేజ్లో భాగంగా వారి అకౌంట్లలో డబ్బులు పడతాయని.. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. 3 లక్షల మందికి ఆధార్ కార్డులో లోపాలు ఉన్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించి రెండో విడతలో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. అర్హులైన రైతులందరి అకౌంట్లను బ్యాంకులు ప్రభుత్వానికి ఇచ్చాయని.. ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్కు డబ్బులు కూడా కట్టామని పేర్కొన్నారు. బ్యాంకులలో తప్పు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.31 వేల కోట రుణమాఫీ చేశామని, కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు.

# గవర్నర్ కు మాజీ సైనికుల సమస్యల వినతి పత్రం

**విశ్వంభర, హైద్రాబాద్ :**

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ను రాజ్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం మర్యాదపూర్వకంగా కలిసి పలు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గంగ రాజు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ సైనికుల సమస్యల పట్ల పలుమార్లు విన్నవించినా కూడా పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మాజీ సైనికులు పడుతున్న సమస్యలను పరిష్కరించడంలో కూడా నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున సైనికుల సమస్యల పట్ల పరిష్కార మార్గాలు చూపే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి తమ ద్వారా విన్నవించుకుంటున్నామని తెలియజేశారు. మాజీ సైనికుల సమస్యల పట్ల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గా ఉన్న మీరు ప్రభుత్వానికి మా డిమాండ్లను తెలియజేసే విధంగా భరోసా కల్పించాలని కోరుతూ సంఘ సభ్యులు రాజ్ భవన్ లో వినతిపత్రం అందజేయడం జరిగింది. గ్రూప్స్ 3 మరియు 4లో 30 శాతం మార్క్ లు, 55 జి.ఓ సవరణ గ్రూప్ 1మరియు 2 లో రిజర్వేషన్లు, ఉద్యోగాల కోటలో 2 శాతం నుండి 10 శాతం వరకు పెంచడం, క్యాంటీన్ లిక్కర్ మరియు గ్రోసరీ రేట్స్ తగ్గించడం, ఈ సీ హెచ్ ఎస్ డిస్ట్రిక్ట్స్ లో కూడా ఏర్పాటు చేయడం, ఎంపానెల్డ్ హాస్పిటల్స్ , సైనిక బోర్డ్స్ లలో మాజీ సైనికులకు ఉద్యోగాలు, జిల్లాల్లో ఎస్పీఓ పోలీసు ఉద్యోగాలు, 5ఎకరాల భూమి, 175 గజాల ప్లాట్, జిల్లాల వారీగా సైనిక గృహాలు, సైనిక బోర్డు ఏర్పాటు, స్టేట్ మాజీ సైనికుల కార్పొరేషన్, యువ కమిటీ ల ఏర్పాటు, సింగరేణిలో కోట పలు అంశాలతో కూడిన డిమాండ్లను చర్చించడం జరిగిందని అని అన్నారు. మాజీ సైనికుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నం చేస్తానని గవర్నర్ భరోసా కల్పించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు హకీమ్, భీమయ్య, వేణు గోపాల్, శివ సాగర్ పాల్గొనడం జరిగింది.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. గవర్నర్





## భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను అభినందించిన సీఎస్

విశ్వంభర, హైదరాబాద్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్ద వాగు కు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల చిక్కుకుపోయిన దాదాపు 40 మందికి ఏవిధమైన అపాయం జరుగకుండా వివిధ శాఖల సమన్వయంతో కాపాడినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ను సీఎస్ అభినందించారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి అని సీఎస్ శాంతి కుమారి అన్నారు. ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాలలో ఈనెల 20, 21 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయాజిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి సీఎస్ ఆదేశించారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం.



విశ్వంభర, కేశంపేట : ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని ఎమ్మెల్యే, మండల విద్యా శాఖ అధికారి అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ కొత్తపేట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఘనంగా వీడుకోలు సమావేశం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల కొత్తపేట గ్రామంలో ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ అధికారి టి.మనోహర్ మాట్లాతూ ఉద్యోగికి బదిలీ తప్పనిదని కాబట్టి ఇక్కడ ఎలా విధులు నిర్వహించారో మరో పాఠశాలలో కూడా అలాగే పని చేసి మరింత ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సాగర్, శ్రీనివాసరావు, సాయి ప్రసాదం, శిరీష, శశికళ, కవిత, సుజాత, అబ్దుల్ బారి, రామ్ శంకర్, రాజుతో పాటు గ్రామ మాజీ సర్పంచ్ జగదీశ్వర్, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ యాదయ్య, ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కృష్ణయ్య, రాజు, హారతి పాల్గొన్నారు.




## నిలిచిన సింగరేణి బొగ్గు ఉత్పత్తి

**విశ్వంభర భూపాలపల్లి :**

జయశంకర్ భుపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుంది. వర్షం కారణంగా భుపాలపల్లి సింగరేణి ఏరియాలోని ఉపరితల బొగ్గు గనులలో వరద నీరు వచ్చి చేరడంతో ఓపెన్ కాస్ట్ 2, 3 గనుల్లో రోడ్లన్నీ బురద మయమై బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయయం ఏర్పడగా సింగరేణి సంస్థ కు సుమారు కోటి రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సింగరేణి అధికారులు అంచనా వేస్తున్నారు.

## గురుపూర్ణిమ వేడుకలకు ముస్తాబైన సాయి ఆలయం





విశ్వంభర, చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి సాయి ఆలయాన్ని ముస్తాబు చేశామని చైర్మన్ మంచికంటి ధనంజయ తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. చింతపల్లి శ్రీ షిరిడి సాయినాధునికి శంఖాభిషేకంతో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయిబాబా ఆలయంలో ఉదయం 5:00 గంటలకు నగర సంకీర్తన, 5:30 గంటలకు కాకడ హారతి, గణపతి హోమం, 6:30 గంటలకు పంచామృతాభిషేకం, 7:30 లకు సంస్థాన్ హారతి అష్టోత్తర పూజ, 10:30 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి, 11:00 గంటలకు శంకుపూజ, 12:00 గంటలకు మధ్యాహ్న హారతి, 12:30 గంటలకు భక్తులచే శంకులతో సాయినాధునికి వైభవంగా అభిషేక నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5:00 గంటలకు మల్లెలతో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు సిద్ధం చేసారు. ఈ కార్యక్రమాలను వేద పండితులు కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ, శివ కిరణ్ ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. సద్గురు తత్వ ప్రచారకులు డాక్టర్ సాయి శ్రీనివాస్ ప్రవచనాలను భక్తులకు అందించనున్నారు. శంఖాభిషేకం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని చైర్మన్ మంచికంటి ధనుంజయ, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## భారీ వర్షా లు, వరదలకు 2024 కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంలోని గోదావరి వరదలు అంతకంతకు పెరుగుతున్నందున వరద ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలోనీ సమస్యలు తెలియజేయడానికి ఐటీడీఏ కార్యాలయంలో భారీ వర్షాలు, వరదలు 2024 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గ్రామాలలోని వరద ముంపునకు గురి అయ్యే ప్రజలు ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని అలాగే గ్రామాలలోని ఎవరైనా ప్రజలు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం 7995268352, సబ్ కలెక్టర్ కార్యాలయం 08743232444, మరియు 7981219425 వరదల కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలి



విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, బీసీ ప్రతినిధుల బృందం బంజారా హిల్స్ లో అయన ఇంటి వద్ద కలిసి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలని కోరారు. గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడల విధానాల వలన బీసీలు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యాన్ని భారీగా నష్టపోయారని మంత్రికి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మెనీఫెస్టోలో బీసీల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ అభిష్టం మేరకు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగనణ జరిపించి బీసీలకు స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్స్ & సివిల్స్ కన్స్ట్రక్షన్ లో మరియు మెంటేనేన్స్ లో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ పేరు తో దేశం గర్వించదగ్గ సీనియర్ బీసీ నాయకులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దారమయ్య చేతులమీదుగా విడుదల చేసారు. కామారెడ్డి డిక్లరేషన్ ను ప్రతిష్టంగా అమలు పరచాలని, తక్షణమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కలగనణ మొదలు పెట్టాలని కులగనణ పూర్తి అయినా తరువాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలి అని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తి చేయాలి అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బీసీల అభ్యున్నతి కోసం పాటుపడతామని మంత్రి హామీ ఇచ్చారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగిరి ప్రవీణ్ కుమార్ పటేల్ ఓయూ విద్యార్థి జేఏసీ కన్వీనర్, ఎర్ర శ్రీహరి గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గిరగాని బిక్షపతి గౌడ్ రాష్ట్ర కార్యదర్శి బీసీ సంక్షేమ సంఘం, పెంట అజయ్ పటేల్ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు, సాయి కిరణ్, శ్రీనాథ్, నిమ్మల శ్రీనివాస్, కాటం రాజు యాదవ్, ప్రశాంత్, రాజేష్, బీసీ యువజన సంఘం నాయకులు, పాల్గొన్నారు.



## బస్సులు దిగబడుతున్న పట్టించుకోరా

విశ్వంభర, ఆమనగల్లు : తలకొండపల్లి మండలం గడ్డమీద తండా గ్రామపంచాయతీకి రోడ్డు సౌకర్యం సరిగ్గాలేని మూలంగా బడి పిల్లలు ప్రయాణించేటు వంటి స్కూలు బస్సు శనివారం ఉదయం రోడ్డుపై దిగబడింది. గడ్డమీద తండా రోడ్డు వానలకు అస్తవ్యస్తంగా తయారవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ ప్రజలు రోడ్డుపై ప్రయాణిస్తుండగా జారిపడి అనేక మందికి కాళ్లు, చేతులు విరగగొట్టుకున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ గా ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్న నేటికీ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యము లేదని ఇప్పటికైనా వెంకట్రావుపేట్ నుండి గడ్డమీద తండా గ్రామపంచాయతీకి బీటీ రోడ్డు వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు



విశ్వంభర, భూపాలపల్లి : గోదావరి తీర ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడుతున్నందున, అన్ని ప్రాజెక్టుల నుండి నీటి విడుదల జరుగుతున్నదని, గోదావరి నదీ ప్రవాహం పెరుగుతున్నందున కాళేశ్వరం మరియు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్ళరాదని, అదేవిధంగా ప్రజలు గోదావరి తీర ప్రాంతంలోకి స్నానాలకు గాని ఇతర పనులకు గాని వెళ్ళరాదని, పశువులను ఆరుబయట మేతకు వదలొద్దని, జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని ఆయన పేర్కొన్నారు. అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9030632608, కంట్రోల్ రూము 18004251123 నంబర్లు కు కాల్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

## మొక్కలను సంరక్షించడం సామాజిక బాధ్యత



విశ్వంభర, ఆమనగల్లు : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం అయన ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండాలో సీఐ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో మాధురి, ఎస్సై వెంకటేష్ తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఈ సంవత్సరం 66 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్క సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అన్ని స్థలాల్లో, అలాగే రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వసుపుల మానయ్య, మండలకాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు జగన్, పసుపుల శ్రీశైలం, మెకానిక్ బాబా, కృష్ణా నాయక్, కాలేమల్లయ్య, పర్వతాలు, రాఘవేందర్, ఎంగలి ప్రసాద్, ఖాదర్, శ్రీనివాస్ రెడ్డి, మైసయ్య, సురేష్ పాల్గొన్నారు.



విశ్వంభర, షాద్ నగర్ : శనివారం హైదరాబాద్ మత్స్య భవన్ లో మెట్టు సాయి కుమార్ తెలంగాణ రాష్ట్రా మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మెన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా షాద్ నగర్ తాలూకా అధ్యక్షులు అంచ రాములు ముదిరాజ్, గూడూర్ మత్స్య సంఘము అధ్యక్షులు గుండు సురేశ్, జిల్లా మత్స్య కారులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## 108 వాహనంలో గర్భిణీ ప్రసవం పురుడుపోసిన 108 సిబ్బంది..

విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ దొడ్డ మానసకి అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో విషయం తెలుసుకున్న ఆశ వర్కర్ విజయ 108 కి ఫోన్ చెయ్యగా జూలూరుపాడు 108 సిబ్బంది హుటాహుటిన వెళ్లి కొత్తగూడెం మత శిశువు హాస్పిటల్ తరలిస్తుండగా మార్గం మధ్యలో మానసకు నొప్పులు ఎక్కువ కావడంత 108 వాహనంలో ఆశ వర్కర్ విజయ సహాయంతో ఈ.ఎమ్.టీ రవి పురుడుపోశాడు. మానస పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది, తల్లి బిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించి పురుడు పోసిన 108 సిబ్బంది ఈ.ఎమ్.టీ రవి, ఆశ వర్కర్ విజయ, పైలెట్ తడికమల్ల శ్రీనుకు మానస కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- ఎస్ఎల్బీసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి




**విశ్వంభర చింతపల్లి :** దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం ఎస్ఎల్బీసీ, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ పట్టణ నిర్మాణ కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో కామ్రేడ్ నీలా వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పల్లా నర్సింహారెడ్డి హాజరై మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కేవలం కమిషన్ ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద శ్రద్ధతో కాలయాపన చేసి నల్లగొండ జిల్లా ప్రాజెక్టు లను గాలికొదిలేసిందని అన్నారు. నక్కల గండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న మాజీ సీఎం కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో స్వర్గీయ వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో సొరంగ మార్గం టన్నెల్ పనులు పూర్తి దశలో ఉండగా బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో 10 కిలోమీటర్లు పూర్తి చేయడానికి శ్రద్ధ చూపలేదని అన్నారు. ఎస్ఎల్బీసీ, నక్కల గండి ప్రాజెక్టు లను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రావడం శుభ పరిణామమని ప్రజా, రైతు ఆకాంక్షల మేరకు ప్రారంభించిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత త్వరగా పూర్తి చేయాలనీ ఆయన కోరారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని డిండి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగు నీటినందించాలని రైతు భరోసా విడుదల చేసి వర్షాకాలం పంటలకు రైతులను ఆదుకోవాలని వృద్ధాప్య వితంతు వికలాంగుల పింఛన్లు పెంచిన వెంటనే అమలు చేయాలని రేషన్ కార్డులు లేని వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని ఇండ్లు ఇళ్లస్థలాలు ఇచ్చి పేద ప్రజలను ఆదుకోవాలని రైతు భీమా అమలు చేయాలని అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేసి తెలుగు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, జిల్లా సమితి సభ్యులు వలమల్ల ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, సహాయ కార్యదర్శులు పగిళ్ళ బుచ్చయ్య, తోటపల్లి నాగేష్, కౌన్సిల్ సభ్యులు ఎండి మైనొద్దీన్, ఏషామోని మల్లేష్, కందుకూరి శ్రీను, జూలూరి జ్యోతిబస్, లింగంపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి గెల్వయ్య, పుప్పాల గిరి ప్రసాద్, పర్వతం శ్రీను, నీలా అనసూయ, పద్మ, జాకీర్, బక్కయ్య పాల్గొన్నారు.


## రాహుల్ గాంధీ.. ఇప్పుడు మేడిగడ్డకు వెళ్లి చూడండీ..

### వై.సతీష్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్



**విశ్వంభర, కాళేశ్వరం :** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అబద్దాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలనుకుని కాంగ్రెస్ పార్టీ అడ్డంగా దొరికి పోయిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి అన్నారు. తెలంగాణకు ప్రాణధార లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆయనతెలిపారు. భారీ ఎత్తున వరదను తట్టుకుని మేడిగడ్డ బ్యారేజీ ఠీవిగా నిలబడింది. గతంలో బ్యారేజీకి వెళ్లి నానా యాగి చేసిన రాహుల్ గాంధీకి ఇప్పుడు ఒకసారి తీసుకెళ్లి చూపించండి. అప్పుడు రాహుల్ గాంధీని వెంటేసుకుని వెళ్లిన పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు కూడా బాధ్యత తీసుకుని మేడిగడ్డకు తీసుకెళ్లండి. ఎలాగూ నెలాఖరులో రాష్ట్రానికి తీసుకొస్తామంటున్నారు కదా. వరంగల్ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లినా ఓ రెండు గంటల్లో మేడిగడ్డకు చేరుకోవచ్చు. కూలిపోయింది, పనికిరాకుండా పోయింది, 80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని మాట్లాడిన రాహుల్ గాంధీని డిమాండ్ చేస్తున్నాను, ఒకసారి వెళ్లి బ్యారేజీని పరిశీలించండి అని అన్నారు. వాస్తవాలు తెలుసుకోండి. ప్రజలకు కూడా చెప్పండి. మేడిగడ్డ ఉందా.? కొట్టుకుపోయిందా.? కూలిపోయిందా..? అనే విషయాలకు ప్రజలకు కూడా వివరించండి. ఎంతసేపు అబద్దాలనే అద్దాల మేడలో ఉండటం కాదు. అప్పుడప్పుడు వాస్తవిక ప్రపంచంలో కూడా జీవించాలని కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి అన్నారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ కు రుణపడి ఉంటాం



**విశ్వంభర చింతపల్లి :** శాసనసభ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేరవేర్చేందుకు చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి 33/11 కెవి కరెంట్ సబ్ స్టేషన్ ను మంజూరు చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ కు గ్రామ ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బైకని రాములు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలలో మల్లారెడ్డిపల్లి గ్రామం నుండి ఎమ్మెల్యే బాలునాయక్ గెలుపుకు అహర్నిశలు కృషి చేసి, గ్రామ ప్రజలు, కార్యకర్తలతో నిరంతరం మమేకమై మండలంలోనే అత్యధిక మెజార్టీ అందించామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేయనున్న క్యాబినెట్ విస్తరణలో ఎమ్మెల్యే బాలు నాయక్ కు మంత్రి పదవి ఇవ్వాలని నిత్యం గ్రామస్తులతో కలిసి, పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వర్షా కాలం.. జాగ్రత్త..! మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీలోని 8వ వార్డులో శనివారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో తిరుగుతూ కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు, లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ కాలువను, అపరిశుభ్రమైన ప్రాంతాలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, ప్రజలందరూ వ్యక్తిగత పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వార్డులలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పారిశుధ్య సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుదీర్, ఎన్విరాంన్మెంట్ ఇంజనీర్ సాయిబాబా, జావీద్ పాల్గొన్నారు.

## ఏం సాధించారని సంబరాలు....!?

- * రైతు భరోసా సొమ్ము ఎగ్గొట్టినందుకా? ఈ సంబరాలు
- * స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈ రుణమాఫీ డ్రామా



**విశ్వంభర, భూపాలపల్లి :** ఏం సాధించారని రుణమాఫీ సంబరాలు చేసుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల శాఖ బీజేపీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రబీ, ఖరీఫ్ లో చెల్లించాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టినందుకు సంబరాలు చేసుకుంటున్నారా? రుణమాఫీ లో కోత పెట్టి.. రైతులను మోసం చేసినందుకా? పంట నష్టపరిహారం ఇవ్వకుండా అన్నదాతలను గోస పెట్టినందుకు సంబరాలు చేసుకుంటున్నారా? అని నిలదీశారు. గత ఎన్నికల్లో రూ. 2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కొర్రీల మీద కొర్రీలు పెడుతూ.. కొంతమందికే రుణమాఫీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) లెక్కల ప్రకారం రాష్ట్రంలో రైతులు తీసుకున్న రుణాల మొత్తం రూ. 64 వేల కోట్లకుపై మాటే అని అన్నారు. అందులో 10వ వంతు మాత్రమే చెల్లించి సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్ లో రైతులకు చెల్లించాల్సిన రైతు భరోసా సొమ్ము ఎగ్గొట్టి.. ఆ డబ్బులో కొంత భాగాన్ని రుణమాఫీకి మళ్లించి.. రైతులకు మేలు చేసినట్లు ఫోజు కొడతారా? అని ప్రశ్నించారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందేందుకే రుణమాఫీ డ్రామాలు తెరపైకి తెచ్చారని వెంకటేష్ గౌడ్ మండిపడ్డారు.

## ప్రయాణికులను అడ్డుకున్న రైల్వే పోలీస్, టీసీలు

**విశ్వంభర, తిరుపతి :** తిరుపతి పౌర్ణమి రోజు అరుణాచల గిరి ప్రదర్శన కొరకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్య భక్తులు అరుణాచల వెళతారు. తిరుపతి నుండి రామేశ్వరం గం.11:50 నిమిషాలకు వెళ్ళు రైలు ముందు భాగం రెండు జనరల్ బోగీలు మరియు వెనుక భాగం రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి. కానీ వేల సంఖ్య జనాభా రద్దీ ఉంటుంది. గత్యంతరం లేని ప్రయాణికులు రిజర్వేషన్ బోగీలలో ప్రయాణిస్తూ అరుణాచల గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుంటారు. ముందస్తు సమాచారం లేకుండా రైల్వే గార్డు టికెట్ తీసుకున్న ప్రయాణికులను రిజర్వేషన్ కంపార్ట్ లో నుండి గెంటి వేశారు. ఈ క్రమంలో ప్రయాణికులకు టీసీలకు వాగ్వివాదం చోటుచేసుకుంది. గం.11:50 నిమిషాలకు వెళ్ళవలసిన రైలు మధ్యాహ్నం 1:35 నిమిషాలకు బయలుదేరింది. రామేశ్వరం ట్రైన్ లోనే అరుణాచలం గిరి ప్రదక్షిణ చేయి భక్తులు వెళ్తుంటారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా టీసీలు రైల్వే పోలీసులు, ప్రవర్తించారని భక్తులు మనోవేదనకు గురి అయ్యారు. ముఖ్యంగా తిరుపతి నుండి అరుణాచలానికి రైలు టికెట్టు 80 రూపాయలు చేసిన తొందరపాటు పని వల్ల ప్రతి టిక్కెట్టుకు 35 రూపాయలు కోత విధిస్తూ లక్షలాది రూపాయలను ప్రజల జేబులకు చిల్లు వేసింది. గత జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలో చూసి చూడనట్టు వదిలేసిన రైల్వే శాఖ ప్రభుత్వ మారిన వెంటనే ప్రజల వద్ద లక్షలాది టికెట్టు క్యాన్సల్ ద్వారా రైల్వే శాఖ లబ్ధి పొందింది ఇది ఇలా ఉండగా గిరి ప్రదక్షిణ చేయు భక్తులు వివిధ రకాల వాహనాల ద్వారా ప్రయాణాలు కొనసాగించారు. ప్రతి పౌర్ణమికి స్పెషల్ ట్రైన్ తిరుపతి అరుణాచలం మధ్య నడిపి ప్రజలకు లబ్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను రైల్వే శాఖ తో మాట్లాడి ప్రజలకు లబ్ధి చేయాలని కోరారు. జనరల్ టికెట్ తీసుకున్న ప్రయాణికులను దించి వేయడంతో రిజర్వేషన్ కంపార్ట్మెంట్ కాళీ సీట్లతో తిరుపతి నుండి బయలుదేరింది.

## కల్వకుర్తి మున్సిపాలిటీ లో మేకపిల్ల పై కుక్కల దాడి



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని కూరగాయల మార్కెట్ దగ్గర శుక్రవారం రాత్రి కుక్కల దాడిలో మేక పిల్ల చనిపోయింది. ఎన్నోసార్లు కల్వకుర్తి మున్సిపాల్ అధికారులకు కుక్కల గురించి మొరపెట్టుకున్న వినిపించు కోవడంలేదని పట్టణ ప్రజలు తెలిపారు. చిన్నపిల్లలు కాలనీలో తిరగాలంటే భయమేస్తుందని మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోక పోవడం వల్లనే మేకపిల్ల చనిపోవడం జరిగిందని అన్నారు. కుక్కల బారిన పడి పసిపిల్లలు చనిపోతున్న ఘటనలు జరుగుతున్న అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని నగర వాసులు మండిపడ్డారు. ఇప్పటికైనా కల్వకుర్తి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని కుక్కల బారి నుండి మూగజీవాలను, చిన్నపిల్లలను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఐఎంఏ డాక్టర్లు తీరును ఖండించిన సుశ్రుత గ్రామీణ వైద్యులు



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్ లో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సూదగాని లక్ష్మయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు వంగ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య మాట్లాడుతూ అర్హత లేని ఆర్ఎంపి, పిఎంపి, గ్రామీణ వైద్యులపై అక్కసుతో ఐఎంఏ డాక్టర్లు మాట్లాడుతున్న మాటలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినేట్ మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు మాపై ప్రేమతో మేము ప్రజలకు అందించే సేవలను గుర్తించి మాకు శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రాలు ఇస్తామని ముందుకు వచ్చిన సందర్భంలో వాళ్ళకి ఏమి అర్హత ఉంది అని వాళ్ళకి ప్రభుత్వం సర్టిఫికెట్ ఇవ్వొద్దు అని చెప్పడానికి వీళ్ళు ఎవరు అని ప్రభుత్వాన్నే దిక్కరిస్తున్న వీళ్ళ పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం గ్రామాలల్లో గ్రామీణ వైద్యులు డబ్బులు ఇచ్చిన ఇయ్యకున్న మానవత్వ హృదయంతో వారికి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులపై ఇంత కక్ష పూరితంగా వ్యవరిస్తున్న ఐఎంఏ డాక్టర్ల పద్ధతి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలల్లో మీ కుటుంబ సభ్యులకు, మీ బంధువులకు ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించే గ్రామీణ వైద్యుల కడుపు మీద కొట్టోద్దు అని గ్రామీణ వైద్యుల కుటుంబాలను రోడ్డున పడేయొద్దు అని వాళ్ళ ఉసురు పోసుకోవొద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యులు ప్రసాద్, రవి కిరణ్, అంజిరెడ్డి, అచ్చయ్య, ఉపేందర్, లక్ష్మణ్, మల్లేష్, ఎల్లారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి, బీర్ల ఐలయ్య చిత్ర పటాలకు పాలాభిషేకం




**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** ఏక కాలంలో రైతు రుణ మాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్ర పటాలకు తాజా మాజీ సర్పంచ్ సుబ్బూరు వెంకటేశ్వర్లుతో కలిసి పాలాభిషేకం చేసిన ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ రైతు డిక్లరేషన్ సమావేశంలో భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏక కాలంలో 2 లక్షల పంట రుణ మాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచే బడుగు బలహీన వర్గాల నాయకుడు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లె పహాడ్ గ్రామంలో వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

## ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుండి ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు వీలుగా "గ్రీవెన్స్ డే" ను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కావున ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా తెలుయజేయడానికి ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుండి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అందుబాటులో ఉండనున్నారు తెలిపారు.

## బీజేవైఎం మహా ధర్నాకు యువమోర్చ నాయకులు



**విశ్వంభర, షాద్ నగర్ :** నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చమని ఆందోళన చేసిన బీజేవైఎం కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ శనివారం ధర్నా చౌక్ దగ్గర బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా ధర్నా కార్యక్రమానికి షాద్ నగర్ నియోజకవర్గం నుండి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీజేవైఎం నాయకులు బయలు దేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొని జండా ఊపి, బీజేవైఎం నాయకులతో కలిసి ధర్నాకు బయలుదేరారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కాని ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి, గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగులను, మహిళలను, పేద ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఎంతో మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మ బలిదానమై తెచ్చుకున్న తెలంగాణా లో గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఇప్పుడు రేవంత్ సర్కార్ మోసం చేస్తుందని అన్నారు. బీజేవైఎం న్యాయమైన డిమాండ్ లు గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్టుపోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలని, పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీ ఓ నెం. 46ను వెంటనే రద్దు చేయాలని అదే విదంగా జాబ్ క్యాలెండర్ ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ప్యాట అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రేవంత్ సర్కార్ నిరుద్యోగులను నిండా ముంచిందని అన్నారు. ఎంతో మంది యువత ఆత్మ బలిదానమైతే తెలంగాణా రాష్ట్ర ఏర్పడ్డదని, మరి తెలంగాణా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు బీజేపీ ఉద్యమం ఆగదని, నిరుద్యోగ యువత బీజేవైఎం అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు రణధీర్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయి కుమార్, సందీప్ యాదవ్, ఉదయ్ గౌడ్, సుబ్రహ్మణ్యం, సాయి గౌడ్, మల్లేష్, గట్టోజు విజయ్, పరమళ్ళ యాదయ్య, మణికంఠ, శ్రీశైలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి మోడీ ప్రభుత్వం...

**ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ .... ఆరు గ్యారంటీలతో ప్రజలను నమ్మించి మోసం చేసింది...**

**ప్రజలకు అండగా నిలబడండి.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పై పోరాటాలకు సిద్ధంకండి...**

**జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి శ్రేణులు పిలుపునిచ్చిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**



**విశ్వంభర, కరీంనగర్ :** స్వతంత్ర భారతదేశ చరిత్రలో నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ పదవి బాధ్యతలు చేపట్టారని, దేశ ప్రజలంతా బీజేపీ ప్రధాని మోడీ పాలనపై విశ్వాసంతో ఉన్నారని, ప్రజల మద్దతు ఆశీర్వాదంతోనే దేశంలో బీజేపీ శకం నడుస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి తెలిపారు. భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ విస్తృత కార్యవర్గ సమావేశం శనివారం హుజురాబాద్ పట్టణం లోజరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ 7 నెలల కాలంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్నికోల్పోయిందన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ లెక్కలేని హామీలు ఇచ్చిందని, ప్రధానంగా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలో ఏ ఒక్క స్కీమ్ ను సక్రమంగా అమలు చేయలేదని, అన్ని పథకాలకు కండిషన్లు పెడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రజల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాట మాడుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేయడానికి బీజేపీ శ్రేణులంత సిద్ధం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ మాత్రమే ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు కార్యకర్తలంతా సమిష్టి కృషి చేయాలన్నారు. కార్యవర్గ సమావేశానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, బంగారి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ లకు అభినందనలు తెలియజేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే బీజేపీని ఎన్నికల్లో ఆదరించి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ను రెండవసారి భారీ మెజారిటీతో గెలిపించినందుకు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు.

**రాజకీయ తీర్మానంలోని ముఖ్యంశాలు..**

- కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వ దశాబ్ద పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారు. కుటుంబ పాలన, అహంకార, మోసపూరిత పాలనకు చైతన్యవంతమైన ప్రజలు చమర గీతం పాడారు. ప్రధానంగా బీఆర్ఎస్ పై ఏర్పడ్డ ప్రజా వ్యతిరేకత, వందరోజులలో ఆరు గ్యారెంటీల స్కీంలను అమలు చేస్తామనే అంశాలు శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కలిసి రావడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికీ ఏడు నెలల కాలం గడిచిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క గ్యారంటీని, సక్రమంగా అమలు చేయలేదు. ఎన్నికల సమయంలో ఏలాంటి కండిషన్ల గురించి చెప్పకుండా, నేడు అన్ని పథకాలకు కండిషన్స్ పెడుతూ ప్రజలను తీవ్రంగా మోసం చేస్తుంది. పథకాలన్నిటికీ రేషన్ కార్డు ప్రామాణికం చేసింది. పథకాలు సక్రమంగా అమలు చేసే ఉద్దేశం గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేనట్లుగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఉందనే విషయం ప్రజలందరికీ అర్థమవుతుంది. అందుకే రేషన్ కార్డులు ఇవ్వకుండా, ప్రతి స్కీంకు రేషన్ కార్డు ప్రామాణికమని అర్హులకు తీవ్ర అన్యాయం చేస్తుంది. ఇలాంటి చర్యలను బీజేపీ జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాము. ఏలాంటి కండిషన్లు లేకుండా అర్హులందరికీ న్యాయం చేయాలని, రేషన్ కార్డులు తక్షణం ఇవ్వాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- మహాలక్ష్మి పథకంలో భాగంగా కేవలం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించి, మహిళలకు ప్రతినెల ఇస్తామన్న రూ. 2,500 లను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలాగే 500ల రూపాయలకే గ్యాస్ సిలిండర్ విషయంలో అనేక తిరకాసులు పెడుతుంది. మహాలక్ష్మి పథకాన్ని సంపూర్ణంగా అమలు చేసి మహిళలకు ఇచ్చిన హామీలన్నీ తక్షణం నెరవేర్చాలని బీజేపీ జిల్లా పక్షాన డిమాండ్ చేస్తూ తీర్మానించారు.
- ఎన్నికలకు ముందు అన్ కండిషనల్ గా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. నేడు అనేక రకాల నిబంధనలు పెట్టి అందరిని ఎగరగొట్టే ప్రయత్నం చేస్తుంది. మార్గదర్శకాలు, నియమ నిబంధనలు పెట్టి రైతులకు అన్యాయం చేస్తుంది. 34 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సిఉండగా ఏదో ఐదు ఆరు వేలకోట్ల రూపాయలు ఇచ్చి దాన్ని పండుగలాగా, ఏదో చారిత్రాత్మక దినం లాగా వర్ణించే పిచ్చి ప్రయత్నం చేస్తుంది. ప్రభుత్వం భేషజాలకు పోకుండా అన్ కండీషనల్ గా రైతాంగానికి చెప్పిన విధంగా రుణమాఫీ చేసి, రైతులను రుణ విముక్తులను చేయాలని డిమాండ్ చేస్తున్నాము. అలాగే ప్రస్తుత సీజన్ లో రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 లు వ్యవసాయ కూలీలకు రూ.12,000లు రైతు భరోసా సహాయాన్ని తక్షణం అందించాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని, పంటలకు ప్రకటించిన రూ. 500 ల బోనస్ ఇవ్వాలని, వరంగల్ రైతు డిక్లరేషన్ లో చెప్పిన హామీలు, వాగ్దానాలను నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే స్కీం విషయంలో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. 200 యూనిట్ల వరకు ఉచితమని చెప్పి, మళ్లీ బిల్లులు జారీ చేస్తున్నారు. దీన్ని బీజేపీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. 200 ఉచిత విద్యుత్తును స్కీమ్ ను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ తీర్మానించారు.
- ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఐదు లక్షల రూపాయలు అందిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు దాని గురించి మాట్లాడడం లేదు. నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల సహాయం అందించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- చేయూత స్కీం ద్వారా ఇస్తామన్న రూ .4,000 లు నెలవారి పింఛను నేటికీ ఎక్కడ అందించడం లేదు. పెన్షన్ మీద ఆధారపడి జీవించే నిస్సహాయుల ఆశల మీద కాంగ్రెస్ నీళ్లు చల్లింది. అర్హులైన ప్రతి ఒక్కరికి రూ. 4,000ల పెన్షన్ ను అందించాలని, వృద్ధులు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు తక్షణం పెన్షన్లు అందించాలని బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ పక్షాన డిమాండ్ చేసింది.
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ప్రకటించిన యువ వికాసం పథకం నీరుగారుతుంది. విద్యార్థులకు ఐదు లక్షల రూపాయల విద్య భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ లపై నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఊసేత్తడం లేదు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుంది. కాంగ్రెస్ ప్రకటించిన విధంగా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలి, మెగా డీఎస్సీని కండక్ట్ చేయాలి. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలనీ, నిరుద్యోగ భృతి అందించాలని, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన వివిధ కుంభకోణాలు అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయి హైకోర్టు న్యాయమూర్తి చే విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు సాగదీత ధోరణినీ అవలంబిస్తుంది. కాలేశ్వరం, ఫోన్ టాపింగ్, డ్రగ్స్, విద్యుత్ ఒప్పందల అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చట్టపరంగా వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంది. ప్రభుత్వ తీరును బీజేపీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. పై అంశాల్లో దోషులను శిక్షించడానికి అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.
- జిల్లాలోని అనేక గ్రామపంచాయతీలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య పనులు కొనసాగడం లేదు. గత సర్పంచులకు బిల్లులు రాక నేటికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నిటిని వెంటనే పరిష్కరించాలని, సర్పంచుల బిల్లులను చెల్లించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా మారింది. వీటివల్ల ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీధి కుక్కల దాడిలో అనేక మంది గాయపడుతున్నారు. జనవాసాల మధ్య ఉంటున్న వీధి కుక్కలను, కోతులను తరలించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.
- జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధులకు అవసరమైన అవసరమైన మందులు లేక ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులు అల్లాడుతున్నారు. పేషంట్లకు అవసరమైన మందులను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో మేల్కొని రోగులకు అవసరమైన మందులను తక్షణం సరఫరా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది.
- కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో రోజు రోజుకీ జటిలంగా మారుతున్న డంపు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలి. స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు కొనసాగించడానికి మరింత సమయం, అవకాశం వచ్చినందున పూర్తిస్థాయిలో పనులన్నింటినీ పూర్తిచేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం కోరుతూ తీర్మానించారు. ఇట్టి సమావేశంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, రాజేంద్రప్రసాద్, నాగేశ్వర్ రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వాసాల రమేష్, జిల్లా బాధ్యులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, సాయిని మల్లేశం, సంపత్ రావు, గుర్రాల వెంకటరెడ్డి , కళ్లెం వాసుదేవ రెడ్డి, రాపర్తి ప్రసాద్, నరసింహా రాజు, బింగి కరుణాకర్, బొంతల కళ్యాణ్ చంద్ర, కటకం లోకేష్, సమ్మిరెడ్డి, సత్యనారాయణ, జానపట్ల స్వామి, మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి నిర్మల, మైనార్టీ మూర్ఛ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి కృష్ణారెడ్డి, బీజేవైఎం, కిసాన్, మైనార్టీ మోర్చాల అధ్యక్షులు దుర్శటి సంపత్, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని ఆయన జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి పూలబుకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## మద్యం తాగించి.. ఇద్దరు మహిళా కూలీలపై వ్యాపారుల అత్యాచారం

- **నాగర్‌కర్నూల్‌లోని హాజీపూర్‌లో ఘటన**
- **ఇంట్లో పని ఉందని చెప్పి మహిళా కూలీలను ఇంటికి తీసుకొచ్చిన ఇద్దరు నిందితులు**
- **పని పూర్తయ్యాక కారులో బయటకు తీసుకెళ్లి మద్యం తాగించిన వైనం**
- **మత్తులో ఉన్న మహిళలపై అత్యాచారం**
- **బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుల అరెస్టు**


**విశ్వంభర, నాగర్ కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో తాజాగా దారుణం వెలుగులోకి వచ్చింది. ఇద్దరు మహిళా కూలీలపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలోని హాజీపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, బల్మూర్ మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలు అచ్చంపేటకు వచ్చి రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం కూడా వారు పని కోసం రాగా పట్టణంలో బండల దుకాణాలు నిర్వహించే ఇద్దరు వ్యక్తులు వినోద్ సింగ్, గజానంద్ సింగ్ తమ ఇంట్లో పని ఉందని కూలి మాట్లాడుకుని మహిళలను తీసుకెళ్లారు. ఇంటిని శుభ్రం చేయించుకున్నారు. పని పూర్తయ్యాక మాటల్లో దింపి, ఇద్దరినీ కారులో ఎక్కించుకుని నల్గొండ జిల్లా డిండి వైపు తీసుకెళ్లి మద్యం తాగించారు. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలోని హాజీపూర్ శివారు ప్రాంతంలో కారు నిలిపి మత్తులో ఉన్న మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారు. తిరిగి సాయంత్రం 6 గంటల సమయంలో అచ్చంపేట శివారులోని క్రీడా మైదానం సమీపంలో మహిళలను వదిలేశారు. అపస్మారక స్థితిలో ఉన్న మహిళలను గమనించిన స్థానికులు డయల్ 100, 108లకు సమాచారం ఇచ్చారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

## బూడిద బిక్షమయ్య గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తొర్ర విష్ణు హైదరాబాద్ లో మాజీ శాసన సభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ ని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తొర్ర విష్ణు మాట్లాడుతూ భగవంతుడు మీకు ఆయూ ఆరోగ్యాలు ఇవ్వాలని, మీరు ఉన్నత పదవులు చేపట్టాలని, పేద ప్రజలకు కొండంత అండగా నిలబడాలని కోరుకున్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమె వెంట మండల మహిళ నాయకురాలులూ ఉన్నారు.

## గోదావరి పరివాహక ప్రాంతాలలో కలెక్టర్, ఎస్పీ పర్యటన



**విశ్వంభర భూపాలపల్లి :** వరద సహాయక చర్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి మారుమూల గ్రామాలలో పర్యటించడం జరిగిందని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం పలిమెల మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పర్యటించారు. అంబటిపల్లి శివారులోని పెద్దంపేట వాగు వంతెనను, జిల్లాలో అత్యవసర పరిస్థితులలో ఉపయోగించే వాటర్ బోట్ పనితీరును, గోదావరిలో బోటులో ప్రయాణించి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అక్కడి నుండి మారుమూల గ్రామమైన దమ్మూరులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల వల్ల క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి మారుమూల ప్రాంతాలలో పర్యటించడం జరిగిందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు అధికారులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని, తద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోడంతో పాటు విపత్తుల సమయంలో యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలిమెల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, గిరివికాస్ పథకం ద్వారా బోర్లు మంజూరు చేసినప్పటికీ త్రి పేజ్ కరెంట్ సరఫరా లేదని, ప్రభుత్వ పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారని దమ్మూరు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ కు తెలుపగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్రి పేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలిమెల మండల కేంద్రంలో 65 లక్షల వ్యయంతో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయలు నిర్మాణం, కోటి 43 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. పలిమెల మండల కేంద్రంలో అధికారుల నివాసాల నిర్మాణాలకు స్థల సేకరణ చేసి ప్రతిపాదనల పంపాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఆత్యధిక వర్షపాతం నమోదవుతుందనీ జిల్లాలో గోదావరి నదితో పాటు ఇతర వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో 10 మంది సుశిక్షితులైన సిబ్బందితో వాటర్ బోట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అత్యవసర పరిస్థితులలో వాటర్ బోట్ ఉపయోగించి రక్షణ చర్యలు చేపట్టవచ్చని అన్నారు. దమ్మూరు లాంటి మారుమూల గ్రామాలలో ప్రజలు తమ పిల్లలను ఉత్తమ చదువులు చదివించాలని బాగా చదువుకొని గ్రామానికి మంచి పేరు తేవాలని తెలిపారు. మంచి విద్యతోనే భవిష్యత్ బాగుంటుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రాం మోహన్ రెడ్డి, తహసిల్దార్ హేమ, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయితి రాజ్ డి.ఈ సాయిలు, ఎస్.ఐ లు పవన్, తమాషా రెడ్డి పాల్గొన్నారు.


**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ కి శనివారం రోజు వారి నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ విజ్ఞప్తి

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం విద్యుత్ శాఖ వారు విద్యుత్ వినియోగదారులకు సూచనలతో కూడిన విజ్ఞప్తి చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లో, వ్యవసాయ పొలాల మధ్య ఉన్న కరెంటు స్తంభాలు తాకరాదన్నారు. విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు: తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోరాదని, తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదని, విద్యుత్ లైన్ కు తగులుచున్న చెట్లను ముట్టుకోరాదని అన్నారు. విద్యుత్ లైన్ కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయవలని, పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. కరెంటు కు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదు, చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. క్వార్టర్ లలో ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు. గాలి దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ యొక్క స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెను. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయవలెనుచ, వర్షం పడుచున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్ మరియు కంప్యూటర్ ల యొక్క స్విచ్ లను ఆఫ్ చేయవలెను, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది తెలిపారు. కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి జేఎల్ఎం, ఎఎల్ఎం, ఎల్ఎం లేదా ఏఈ దృష్టికి తీసుకెళ్లాలి అని మండల విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి పత్రికలకు తెలిపారు.

# వర్షంలో 8 కిలోమీటర్లు పరుగెత్తి మహిళ ప్రాణాలు కాపాడిన పోలీస్ డాగ్



**విశ్వంభర, బెంగళూరు :** ఓ పోలీస్ జాగిలం చేసిన పనికి ప్రజలంతా దానిని ప్రశంసిస్తున్నారు. పోలీస్‌డాగ్ సాహసానికి ప్రజలు సెల్యూట్ చేస్తున్నారు. జోరు వర్షంలో 8 కిలోమీటర్లు పరిగెత్తిన జాగిలం హంతకుడి బారినుంచి మహిళ ప్రాణాలను కాపాడింది. హత్యకు గురైన వ్యక్తి మృతదేహం వద్ద వాసన చూసిన పోలీస్ డాగ్ అతడు మరో హత్య చేయకుండా అడ్డుకోగలిగింది. కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో గురువారం రాత్రి 9.45 గంటల సమయంలో సంతబెన్నూరులోని పెట్రోలు బంక్ సమీపంలో హత్యకు గురైన ఒక వ్యక్తి మృతదేహాన్ని గస్తీ పోలీసులు గమనించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాగా, ఎస్పీ ఉమా ప్రశాంత్ వెంటనే స్పందించారు. పోలీస్ డాగ్ తుంగ 2, దాని హ్యాండ్లర్ అయిన కానిస్టేబుల్ షఫీ, ఇతర పోలీస్ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. డాబర్‌మ్యాన్ డాగ్ ఆ మృతదేహం వద్ద వాసన చూసింది. హంతకుడ్ని పసిగట్టేందుకు అక్కడి నుంచి పరుగులు తీసింది. పై నుంచి జోరు వర్షం కురుస్తుండగా, వానలో 8 కిలోమీటర్ల దూరం పరుగెత్తింది. చన్నాపురా గ్రామానికి చేరింది. పెద్దగా అరుపులు వినిపించిన ఒక ఇంటి వద్ద ఆగింది ఆ పోలీస్ డాగ్. అక్కడ గట్టిగా మొరగడంతో పోలీస్ డాగ్‌ను వెంబడిస్తూ వెళ్లిన పోలీసులు ఆ ఇంటి తలుపులు బద్ధలుకొట్టారు. ఒక మహిళను కొట్టి చంపుతున్న హంతకుడ్ని పట్టుకున్నారు. స్పృహ కోల్పోయే స్థితిలో ఉన్న ఆ మహిళను రక్షించారు. మరోవైపు హత్యకు గురైన వ్యక్తిని 33 ఏళ్ల సంతోష్‌గా పోలీసులు గుర్తించారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు.

# రేపటి నుంచి బడ్జెట్ 2024 సమావేశాలు



**విశ్వంభర, ఢిల్లీ :** బడ్జెట్ 2024 సమావేశాలు ఎల్లుండి (జులై 22) నుంచి ప్రారంభం కానున్నాయి. 20242025కి సంబంధించిన కేంద్ర బడ్జెట్ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న ఉదయం 11:00 గంటలకు పార్లమెంట్లో సమర్పించనున్నారు. అంతకంటే ముందు జూలై 22న ఎకనమిక్ సర్వే రిలీజ్ చేస్తారు.ఇప్పటికే 202425 బడ్జెట్ రూపకల్పన తుదిదశకు చేరుకుంది.లోక్సభలో ఆర్థికమంత్రి సీతారామన్ ఈ నెల 23వ తేదీన మోడీ 3.0 ప్రభుత్వ మొదటి పూర్తి స్థాయి బడ్జెట్ను ప్రవేశ పెడుతున్నారు. ఇందులో ప్రధానంగా ఉద్యోగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీటిపై కొన్ని ప్రత్యేక ప్రకటనలు చేయవచ్చని నిపుణులు భావిస్తున్నారు.పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని బడ్జెట్లో ప్రతిపాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముడి పదార్థాలపై సుంకాలను తగ్గించడం ,లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల ట్యాక్స్ కనీస హోల్డింగ్ వ్యవధిని ప్రస్తుత సంవత్సరం నుంచి 2 లేదా 3 సంవత్సరాలకు పొడిగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం.. వాటిపై 2 శాతం సెస్ పెంపు



**విశ్వంభర, బెంగళూరు:** సినిమా టిక్కెట్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లపై 2 శాతం సెస్ విధించే ప్రతిపాదనలపై కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తుంది.దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని సినీ కళాకారులు, సాంస్కృతిక ప్రదర్శనకారులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలకు ఉపయోగించాలని భావిస్తుంది. దీనికి సంబంధించిన ఓ బిల్లును కూడా తాజాగా రూపొందించింది. సినీ, సాంస్కృతిక కళాకారుల సంక్షేమం బిల్లు 2024ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అంతేకాకుండా కళాకారులకు సామాజిక భద్రత, సంక్షేమాన్ని అందించడానికి ఉద్దేశించిన పథకాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఒక నిధిని రూపొందించాలని అసెంబ్లీలో ప్రతిపాదించారు. ఈ బోర్డులో వివిధ సాంస్కృతిక రంగాలు, అకాడమీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 17 మంది ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యులు, ఆ శాఖ మంత్రి, సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ సెస్ మొత్తం 2 శాతానికి మించబోదు. ప్రతి మూడు ఏళ్ళకి సెస్ మొత్తాన్ని సవరించేలా బిల్లుకు రూపకల్పన చేశారు.

# జమ్మూలో ఉగ్రవాదులకు చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగిన కమాండోలు

**విశ్వంభర, జమ్మూ:** జమ్మూ ప్రాంతంలో వరసగా ఉగ్రవాదుల చొరబాట్లు.. దాడులు జరుగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే వరస ఉగ్రవాద ఘటనల దృష్ట్యా భారత సైన్యం మూడు నుంచి నాలుగు వేల మంది అదనపు సైనికులను అక్కడ మోహరించింది. ఇపుడు భారత ఆర్మీ.. జమ్మూ ప్రాంతానికి బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం, మూడు బెటాలియన్లు , కొన్ని పారా ఎస్ఎఫ్ బృందాలను కూడా పంపింది. ఒక బెటాలియన్‌లో దాదాపు 1100 మంది సైనికులు ఉంటారని తెలుస్తుంది. అదేవిధంగా పారా ఎస్ఎఫ్ బృందంలో దాదాపు 40 మంది కమాండోలు ఉంటారు. ఈ విధంగా చూస్తే జమ్మూకు దాదాపు 500 మంది పారా కమాండోలను అదనంగా పంపారు. దీనితో పాటు, సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్) కూడా జమ్మూ ప్రాంతంలో అదనపు దళాలను మోహరించింది.

**సైనికుల కొరతను సద్వినియోగం చేసుకున్న ఉగ్రవాదులు**

తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఎసి)వద్ద ఉద్రిక్తత ప్రభావం.. జమ్మూ ప్రాంతంలో కనిపించింది. ఉగ్రవాదులు అక్కడ మళ్లీ విజృంభించే అవకాశం వచ్చింది. సైనికుల కొరతను సద్వినియోగం చేసుకొని ఉగ్రవాదులు తమను తాము పెంచుకోవడమే కాదు ఇప్పుడు జమ్మూ ప్రాంతంలోని భద్రతా బలగాలకు పెద్ద తలనొప్పిగా మారారు.




# ఫ్లిప్ కార్ట్, ఆమెజాన్ సూపర్ ఆఫర్స్




**విశ్వంభర, ముంబై :** అమెజాన్.. ప్రైమ్ డే సేల్ పేరుతో ఆఫర్స్ అందించనున్న విషయం తెలిసిందే. అయితే కేవలం ప్రైమ్ యూజర్లకు మాత్రమే అందుబాటులోకి వస్తున్న ఈ సేల్ జులై 20,21వ తేదీల్లో అందుబాటులో ఉంది. అంటే ఈరోజు, రేపు అనమాట.ఈ సేల్‌లో పలు బ్యాంకులకు చెందిన కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా డిస్కౌంట్స్ లభించయనున్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకులకు చెందిన డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే 10 శాతం ఇన్‌స్టాంట్ డిస్కౌంట్స్ లభిస్తోంది. అలాగే అమెజాన్ కొన్ని ఆఫర్లను కూడా అందిస్తోంది. ముఖ్యంగా పలు స్మార్ట్ ఫోన్‌లు తక్కువ ధరకే లభిస్తున్నాయి. ప్రైమ్ డే సేల్‌లో స్మార్ట్ ఫోన్స్‌పై లభిస్తోన్న బెస్ట్ డీల్స్ కొన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. ఐఫోన్ 13 ప్రస్తుత ధర రూ. 52 వేలు ఉండగా. సేల్‌లో రూ. 48,799కే సొంతం చేసుకోవచ్చు. బ్యాంక్ ఆఫర్‌లో మరో వెయ్యి రూపాయాలు కూడా డిస్కౌంట్ పొందొచ్చు. దీంతో ఈ ఫోన్‌ని రూ. 47,799కి పొందొచ్చు. అలాగే వన్‌ప్లస్ నార్డ్4, శాంసంగ్ ఎం35, మోటోరొలా రేజర్ 50 అల్ట్రా, హానర్ 200 సిరీస్, లావా బ్లేజ్ ఎక్స్ 5జీ ఫోన్స్ తొలిసారి సేల్ ప్రారంభంకానున్నాయి. వన్‌ప్లస్ 12 ఫోన్ పై భారీ డిస్కౌంట్ లభిస్తోంది. ఈ ఫోన్ అసలు ధర రూ.64,999 కాగా.. సేల్‌లో బ్యాంక్ ఆఫర్‌తో కలుపుకొని రూ.52,999కే సొంతం చేసుకోవచ్చు. సామ్‌సంగ్ గ్యాలక్సీ ఎస్23 అల్ట్రా ఫోన్ ధర రూ.74,999, ఐకూ నియో 9 ప్రో ధర రూ. 29,999కే సొంతం చేసుకోవచ్చు. వన్‌ప్లస్ నార్డ్ సీఈ4 రూ.21,999, రెడ్‌మీ 13సి రూ.9499కే సొంతం చేసుకోవచ్చు.అమెజాన్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ కూడా సేల్‌ను నిర్వహిస్తోంది. గోట్ పేరుతో జూలై 19 నుంచి 23 దాకా ఐదురోజులపాటు సేల్ ప్రకటించింది.వస్తువుల కొనుగోళ్లపై 10 శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నారు. అలాగే ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్ డిఎఫ్ సి బ్యాంకులు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ అందిస్తుంది. ఇక వీటితో పాటు కొన్ని రకాల స్మార్ట్ ఫోన్‌లపై ఫ్లిప్‌కార్ట్ కళ్లు చెదిరే ఆఫర్లను అందిస్తోంది. ఇందులో భాగంగా స్మార్ట్ ఫోన్స్‌పై లభిస్తోన్న కొన్ని బెస్ట్ ఆఫర్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం..నథింగ్ ఫోన్2పై భారీ డిస్కౌంట్ లభిస్తోంది. ఈ ఫోన్ అసలు ధర రూ. 33,999 కాగా, సేల్ భాగంగా కేవలం రూ.28,999కే సొంతం చేసుకోవచ్చు. అలాగే పలు బ్యాంకులకు చెందిన కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా డిస్కౌంట్ కూడా పొందొచ్చు. దీంతో ఈ స్మార్ట్ ఫోన్‌ను రూ. 19,999కే సొంతం చేసుకోవచ్చు. అలాగే ఐఫోన్ 14 ప్లస్‌పై కూడా భారీ డిస్కౌంట్ ఉంది. దీని అసలు ధర రూ.55,999కాగా బ్యాంకు ఆఫర్లతో పాటు, ఎక్స్చేంజ్ ఆఫర్లతో కలిపి ఈ సేల్‌లో భాగంగా రూ. 53,999కి దీన్ని సొంతం చేసుకోవచ్చు.గూగుల్ పిక్సెల్ 8 అసలు ధర రూ. 61,999 రూపాయలు కాగా ఫ్లిప్ కార్ట్ గోట్ సేల్ లో కేవలం రూ. 47,999కే లభిస్తోంది. పలు బ్యాంకులకు చెందిన కార్డులతో కొనుగోలు చేస్తే అదనంగా రూ. 4000 డిస్కౌంట్ ని పొదొచ్చు. గూగుల్ పిక్సెల్ 7 ప్రో మోడల్ మార్కెట్ ధర 55,999 రూపాయలు కాగా 50,999 రూపాయలకు లభించనుంది.ఇక మోటోరోలా ఎడ్జ్ 50 ప్రో అసలు ధర రూ. 29,999 కాగా, సేల్‌లో భాగంగా రూ. 28000కే సొంతం చేసుకోవచ్చు. బ్యాంక్ ఆర్లలో భాగంగా దీనికి రూ 2 వేల డిస్కౌంట్ లభిస్తోంది.

# అత్యధిక ఫాలోవర్లు కలిగిన నేతగా మోదీ.. ఎలాన్ మస్క్ శుభాకాంక్షలు



**విశ్వంభర, ఢిల్లీ :** ఎక్స్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన ప్రపంచ నేతగా రికార్డు సృష్టించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి టెక్ ఎంట్రప్రెన్యూర్, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ శుభాకాంక్షలు తెలిపారు. ''అత్యధిక ఫాలోవర్లతో ఉన్న ప్రధాని మోదీకి కంగ్రాట్స్'' అని ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. జులై 14న ఎక్స్‌లో మోదీ ఫాలోవర్ల సంఖ్య 100 మిలియన్లు దాటిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా నెట్టింట పంచుకున్నారు. ఇంతటి ఉత్సాహ భరిత వేదికలో ఉండటం తనకెంతో ఆనందమని కామెంట్ చేశారు. ఈ వేదికగా జరిగే చర్చలు, నిర్మాణాత్మక విమర్శలు, ప్రజలు ఇచ్చే దీవెనలు తనకెంతో ఇష్టమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నట్టు కామెంట్ చేశారు. ప్రపంచంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అందరినీ మించి మోదీ ఫాలోవర్లను సొంతం చేసుకున్నారు. గ్లోబల్ సెలబ్రిటీలైన టేలర్ స్విఫ్ట్ (95.3 మిలియన్ ఫాలోవర్లు), లేడీ గాగా (83.1 మిలియన్లు), కిమ్ కర్దేషియన్ (75.2 మిలియన్లు) లను సైతం ఆయన మించిపోయారు. ఇక ప్రపంచరాజకీయ నేతలు ఎవరూ మోదీ దరిదాపుల్లో కూడా లేరు. అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు 38.1 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండగా దుబాయ్ పాలకుడు షేక్ ముహమ్మద్‌కు 11.2 మిలియన్ల ఫాలోవర్లు, పోప్ ఫ్రాన్సిస్‌కు 18.5 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇక క్రికెట్ ప్రపంచ స్టార్లు విరాట్ కోహ్లీ (64.1 మిలియన్ ఫాలోవర్లు), ఫుట్‌బాల్ స్టార్ నేమార్ జూనియర్ (63.6 మిలియన్), బాస్కెట్ బాల్ ప్లేయర్ లెబ్రాన్ జేమ్స్ (52.9 మిలియన్లు) కూడా వెనకబడే ఉన్నారు. కాగా, గత మూడేళ్లల్లోనే మోదీ ఫాలోవర్ల సంఖ్య ఏకంగా 30 మిలియన్ల మేర పెరిగింది. 2009లో ఎక్స్‌లో చేరిన మోదీ నాటి నుంచీ తన ఫాలోవర్లతో ఈ వేదికగా నిత్యం టచ్‌లో ఉంటున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందిరికీ ఎక్స్ వేదికగా బదులిస్తూ ఎవరినీ బ్లాక్ చేయకుండా తనదైన శైలిలో నెటిజన్ల అభిమానాన్ని చూరగొంటున్నారు.

# యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా.. సన్యాసం స్వీకరించే యోచన



**విశ్వంభర, ఢిల్లీ :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మనోజ్ సోనీ.. తన పదవికి రాజీనామా చేశారు. పదవీకాలం ముగియడానికి అయిదు సంవత్సరాలకు ముందే ఈ అత్యున్నత హోదా నుంచి తప్పుకొన్నారు. స్వచ్ఛందంగా ఆయన వైదొలిగారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అత్యంత నమ్మకస్తుడిగా ఆయనకు పేరుంది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో మనోజ్ సోని తన పదవికి రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ సహా పలు కీలక పరీక్షల్లో గందరగోళం నెలకొంది. మరోవైపు ప్రొబేషనరీ ఐఎఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వ్యవహారం రోజురోజుకూ దుమారం రేపుతోంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్వయానా ఆమెపై కేసు నమోదు చేసింది. సివిల్ సర్వీసెస్ పరీక్షల నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకుంది. ఇక ముందు ఆమె సివిల్స్ రాయకుండా డిబార్ చేయాలని ఆదేశించింది. ఆమెకు షోకాజ్ నోటీసులను సైతం అందజేసింది. ఈ పరిస్థితుల్లో మనోజ్ సోనీ రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. 2029 వరకు ఆయన యూపీఎస్సీ ఛైర్మన్‌గా కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. అయిదేళ్ల ముందే తప్పుకున్నారు. గతంలో యూపీఎస్సీ సభ్యుడిగా కొనసాగారు. 2023లో ఛైర్మన్‌గా అపాయింట్ అయ్యారు. అయితే మనోజ్ సోని సన్యాసం తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. స్వామినారాయణ్ బోధనలను అనుసరిస్తూ అనుపమ్ మిషన్ ద్వారా నిష్కామ యోగిగా మారాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.



# బంగ్లాదేశ్ అల్లర్లలో 105 మంది మృతి.. దేశవ్యాప్త కర్ఫ్యూ విధింపు

**విశ్వంభర, బంగ్లాదేశ్ :** విద్యార్థులు, నిరుద్యోగుల ఆందోళనలతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. దీంతో షేక్ హసీనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. విద్యార్థుల ఆందోళనలను అదుపు చేయడంలో పోలీసులు విఫలం కావడంతో మిలటరీని రంగంలోకి దించింది. కాగా, ఆందోళనల్లో ఇప్పటి వరకు 105 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క రాజధానిలోనే 52 మంది మృతి చెందారు. ఎక్కువ మరణాలకు పోలీసుల కాల్పులే కారణమని తెలుస్తోంది.

**ఇంటర్నెట్ నిలిపివేత**

రాజధాని ఢాకాలో ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రజలు గుమికూడడాన్ని నిషేధించారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. ప్రభుత్వం ఎన్ని నిషేధాలు విధించినా తమ ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు తెగేసి చెబుతున్నారు. ఈ మరణాలకు ప్రధాని షేక్ హసీనానే కారణమని, ఆమె వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**జైలుకు నిప్పు**


నర్సింగ్ది జిల్లాలో ఆందోళనకారులు జైలులోకి దూసుకెళ్లి ఖైదీలను విడుదల చేశారు. అనంతరం జైలుకు నిప్పు పెట్టారు. జైలు నుంచి వందలాదిమంది ఖైదీలు పారిపోయినట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థి ఆందోళనకారులపై దాడులు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని, ఇది ఆమోదయోగ్యం కాదని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎందుకీ ఆందోళనలు**

స్వతంత్ర దేశం కోసం పాకిస్థాన్‌తో 1971లో జరిగిన విముక్తి యుద్ధంలో పాల్గొన్న వారి పిల్లలు సహా కొన్ని నిర్దిష్ట సమూహాలకు సగానికిపైగా సివిల్ సర్వీస్ పోస్టుల్లో రిజర్వ్ చేసిన కోటా వ్యవస్థకు ముగింపు పలకాలంటూ ఈ నెలలో విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళనలకు పిలుపునిచ్చారు. ప్రధాని హసీనాకు మద్దతునిచ్చే ప్రభుత్వ అనుకూల గ్రూపుల పిల్లలే ఈ పథకం నుంచి లబ్ధి పొందుతున్నారన్న విమర్శలున్నాయి.

# భారతదేశాన్ని బ్లాక్ లిస్టులో పెట్టిన టర్కీ !

**విశ్వంభర, ఢిల్లీ:** ఇండియాకు ఊహించని షాక్ ఇచ్చింది టర్కీ దేశం. భారతదేశాన్ని బ్లాక్ లిస్టులో పెట్టింది టర్కీ. భారత్ నుండి ఆయుధాలు మరియు రక్షణ సంబంధిత వస్తువుల ఎగుమతిపై టర్కీ పూర్తిగా నిషేధాన్ని విధించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌కు సైనిక పరికరాలను ఎగుమతి చేయడంపై టర్కీ ప్రభుత్వం సమగ్ర నిషేధం విధించింది. భారత షిప్‌యార్డ్‌లో షిప్‌బిల్డింగ్ ప్రాజెక్ట్‌లో నిమగ్నమైన టర్కీ సంస్థతో న్యూఢిల్లీ ఒప్పందాన్ని రద్దు చేసిన కొన్ని నెలల తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. టర్కీ, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న హాబ్‌నాబింగ్‌తో, అంతర్జాతీయ సమస్యలపై భారతదేశం టర్కీకి వ్యతిరేకంగా వైఖరిని తీసుకుంటోంది.



# ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

**విశ్వంభర, ఢిల్లీ :**

వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ మెడ చుట్టూ ఉచ్చు మరింతగా బిగుసుకుంటోంది. ఆమె పలు అక్రమాలకు పాల్పడినట్టు ఇప్పటికే గుర్తించిన అధికారులు తాజాగా మరో బాగోతాన్ని వెలికి తీశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమె ఏకంగా 12 సార్లు సివిల్స్ పరీక్షలకు హాజరైనట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్2022 నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు భవిష్యత్తులో మళ్లీ ఆమె పరీక్షలకు హాజరు కాకుండా చర్యలు చేపడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

**ధ్రువపత్రాలు మార్చి 12సార్లు పరీక్షలు**

జనరల్ కేటగిరీ అభ్యర్థులు 32 ఏళ్ల వరకు ఆరుసార్లు మాత్రమే సివిల్స్ రాసేందుకు అనుమతిస్తారు. ఓబీసీ అభ్యర్థులు 35 ఏళ్లు, ఓబీసీ దివ్యాంగ అభ్యర్థులు 42 ఏళ్లు వచ్చే వరకు 9 సార్లు పరీక్షకు హాజరు కావొచ్చు. కానీ, పూజ తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫొటో, సంతకం, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ చిరునామా వంటివి మార్చడం ద్వారా ఏకంగా 12 సార్లు సివిల్స్ పరీక్ష రాశారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

**పూజ తల్లి ఇంజినీరింగ్ సంస్థ సీజ్**

తనపై కేసు నమోదు కావడంతో పూజ ఖేద్కర్ నిన్న మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాను వదిలి వెళ్లిపోయారు. మళ్లీ వస్తానంటూ నాగ్‌పూర్ వెళ్లారు. మరోవైపు, పూజ తల్లికి సంబంధించిన ఇంజినీరింగ్ సంస్థను పింప్రిచించ్‌వాడ నగరపాలక సంస్థ నిన్న సీజ్ చేసింది. దాదాపు రూ. 2 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. కాగా, తుపాకీతో రైతులను బెదిరించిన కేసులో పూజ తల్లి మనోరమ ప్రస్తుతం పూణే పోలీసుల అదుపులో ఉన్నారు.





## టీడీపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో చంద్రబాబు ఆసక్తికర కామెంట్స్

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇవాళ టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. ఏపీ మంత్రుల నుంచి ఆయా శాఖలకు చెందిన సమాచారాన్ని తీసుకోవాలని తమ ఎంపీలకు చంద్రబాబు నాయుడు సూచించారు. వాటిపై కేంద్ర సర్కారుతో సంప్రదింపులు జరపాలని చెప్పారు. అవసరాలకు అనుగుణంగా ఏపీ మంత్రులను వెంట పెట్టుకుని ఆయా శాఖలకు చెందిన కేంద్ర మంత్రులతో భేటీ కావాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఎంపీలు పోటీ పడి పని చేయాలని చెప్పారు. ఏపీలో దాడులు జరుగుతున్నాయంటూ ఢిల్లీలో ధర్నా చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయంపై కూడా భేటీలో చంద్రబాబు మాట్లాడారు. జగన్ గురించి, వైసీపీ గురించి అంతగా ఆలోచించాల్సిన అసవరం లేదని పలువురు ఎంపీలు అన్నారు. ఢిల్లీలో జగనేం చేస్తారో ముఖ్యం కాదని చంద్రబాబు నాయుడు చెప్పారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నుంచి పారిపోయేందుకే జగన్ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. వైసీపీ అసత్యపు ప్రచారాన్ని తిప్పికొడదామని చెప్పారు. కాగా, టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం రెండున్నర గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశంలో పలువురు రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొన్నారు.

## అతను రోడ్డు మీదికి వస్తే రాష్ట్రాభివృద్ధి వెనక్కి వెళుతుంది

### కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలో గత 45 రోజులుగా జరుగుతున్న పరిణామాలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపడతామని వైసీపీ అధ్యక్షుడు జగన్ ప్రకటించడంపై కేంద్ర రూరల్ డెవలప్ మెంట్, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. జగన్ వల్ల రాష్ట్రానికి చెడ్డపేరు వస్తోందని అన్నారు. అతను రోడ్డు మీదికి వస్తే రాష్ట్రాభివృద్ధి అంత వెనక్కి వెళ్లిపోతుందని స్పష్టం చేశారు. "జగన్ కు నిరసన తెలిపే అర్హత ఎక్కడుంది? మాచర్లలో చంద్రయ్యను అతి కిరాతకంగా చంపారు. అదీ... రాజకీయ హత్య అంటే! ఇది ఎవరో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేయాలని చూస్తున్నారు. వినుకొండలో జరిగింది రాజకీయ హత్య ఎలా అవుతుంది? మాచర్లలో జరిగింది రాజకీయ హత్య. ఆ రోజు నువ్వు ఏం చేశావ్? బయటికి వచ్చావా? మాచర్ల వెళ్లావా? రాష్ట్రాన్ని అత్యంత అవినీతి మయంగా, ఘోరంగా, అభివృద్ధి లేకుండా చేశారు. నీకేం అర్హత ఉందని ఢిల్లీ వెళతావు? ఢిల్లీలో ఎక్కడికి వెళ్లినా ఏపీ గురించి మాట్లాడాలంటే అవమానకరంగా ఉంది. జగన్ గురించి ఎవరిని అడిగినా చెబుతున్నారు. ఢిల్లీలోనే కాదు, ఈశాన్య రాష్ట్రాలకు కూడా ఆయన ఖ్యాతి పాకిపోయింది!" అంటూ పెమ్మసాని విమర్శనాస్త్రాలు సంధించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం, హత్య ఘటనలో ఒకరు మృతి



**విశ్వంభర, నంద్యాల:** నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసి, హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, బాలిక మృతదేహం ఇప్పటికీ లభ్యం కాలేదు. తాజాగా.. ఈ ఘటనలో కీలక మలుపు చోటు చేసుకుంది. ముచ్చుమర్రికి చెందిన వ్యక్తి యెహోన్ (హుస్సేన్) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ముగ్గురు మైనర్ బాలురులో ఒకరికి మేనమామగా సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 30 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, బాలికపై అత్యాచారం, హత్య కేసులో యెహోన్ ను పోలీసులు విచారించారు. మృతిడి ముఖం, ఒంటిపై గాయాలు ఉండటంతో పోలీసులపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లాకప్ డెత్ జరిగిందని, కేసు విచారణ పేరుతో పోలీసులే కొట్టి చంపారని ఆరోపిస్తున్నారు.

## జగన్ తప్పుడు మాటలకు ఎవరూ భయపడరు: మంత్రి అనగాని సత్యప్రసాద్

**విశ్వంభర, గుంటూరు :** ఏపీలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయన్న విషయాన్ని జాతీయ స్థాయిలో తెలియజేస్తామని, అందుకే ఢిల్లీలో 'సింబాలిక్ ప్రొటెస్ట్' నిర్వహిస్తామని వైసీపీ అధినేత జగన్ ప్రకటించడంపై ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. ఏ ముఖం పెట్టుకుని జగన్ ఢిల్లీ వెళుతున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్త చంద్రయ్యను హత్య చేశారని, జగన్ పాలనలో ఎన్నో హత్యలు జరిగాయని ఆరోపించారు. జగన్ సవ్యంగా ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని మంత్రి అనగాని వ్యాఖ్యానించారు. జగన్ తప్పుడు మాటలకు ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రౌడీయిజాన్ని అణచివేస్తామని పేర్కొన్నారు.

# శ్రీవారి లడ్డూకి పూర్వవైభవం తీసుకొస్తాం.. త్వరలోనే హోటల్స్‌కు కొత్త పాలసీ

### టీటీడీ ఈవో శ్యామలరావు



**విశ్వంభర, తిరుమల:**

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతలు చేపట్టి నెలరోజులు పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలపై ప్రస్తావించారు. టీటీడీకి ఈవోగా పంపుతూ తిరుమలలో చాలా లోపాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు. గత నెల రోజులుగా తిరుమలలో తనిఖీలు నిర్వహించి అనేక లోపాలు ఉన్నాయని గుర్తించాం. అన్నప్రసాదాలు, లడ్డు ప్రసాదం క్వాలిటీ లేదు. తిరుమల లడ్డూ పేటెంట్ హక్కులు ఉన్నాయి అందుకు తగినట్లుగా లడ్డు క్వాలిటీ లేదు. దర్శనం టికెట్లు జారీలో వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. తిరుమల పవిత్రత కాపాడే విధంగా కార్యక్రమాలు ఉండాలని సీఎం చెప్పారు. క్యూలైన్లో తనిఖీలో అన్నప్రసాదాలు, పాలు అందలేదు అనే ఫిర్యాదులు వచ్చాయి. సమస్య చెప్పుకోవడానికి ఎవరూ లేరన్న ఫిర్యాదులు కూడా వచ్చాయి. భక్తుల సూచన మేరకు క్యూలైన్ల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఏఈఓ లను నియమించామని శ్యామలరావు అన్నారు. అన్నప్రసాదంలో నాణ్యత పెంపుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. తాజాగా క్యూలైన్లో మూడు చోట్లా అన్నప్రసాదాలు వితరణ కేంద్రాలు పెట్టామని ఈవో శ్యామలరావు చెప్పారు. రాబోయే 25 30 సంవత్సరాలు దృష్టిలో ఉంచుకొని అన్న ప్రసాదంలో మార్పులు చేయాలి. లడ్డూ నాణ్యత పెంపుకోసం నాణ్యమైన నెయ్యి, ఇతర ముడి సరుకులు నాణ్యమైనవి కలిగినవి కొనుగోలు చేయాలి. అన్న ప్రసాదం మరింత నాణ్యత పెంపుకు నిపుణులతో చర్చిస్తున్నాం. శ్రీవారి లడ్డూకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఈఓ శ్యామలరావు అన్నారు. తిరుమలలో ఆహార పదార్థాలు నాణ్యతను పరిశీలించడానికి ఎఫ్ఎస్ఎస్ఐ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఎఫ్ఎస్ఎస్ఐ మొబైల్ ల్యాబ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

# 35, 36 అంటున్నారు... ఆ లెక్కలు శుద్ధ తప్పు

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



**విశ్వంభర, నరసరావుపేట:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇవాళ టీడీపీ పార్లమెంటరీ సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం నరసరావుపేట ఎంపీ, లోక్ సభలో టీడీపీ సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదని నేటి సమావేశానికి హాజరైన ఎంపీలకు, రాష్ట్ర మంత్రులకు స్పష్టం చేశారని వెల్లడించారు. ఈ సందేశాన్ని ఎమ్మెల్యేలకు కూడా చెప్పాలని చంద్రబాబు సూచించారని తెలిపారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై స్వయంగా తానే దృష్టి పెడతానని, శాంతి భద్రతలను నెలకొల్పేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారని లావు శ్రీకృష్ణదేవరాయలు వివరించారు. "35, 36 (హత్యలు) అని వాళ్లు (వైసీపీ) చెబుతున్న లెక్కలు శుద్ధ తప్పు. 35, 36 అంటున్నారు కదా... దయచేసి వాళ్ల పేర్లు, అడ్రస్ లు ఇవ్వండి. ఏ పార్టీయో, కులమో, మతమో చూసే వ్యవహారం కాదిది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో న్యాయం వైపు నిలబడి ఉన్నాం. న్యాయం చేయడానికే ఉన్నాం. ఈ 35 నెంబరు అనేది అవాస్తవం. వినుకొండలో జరిగిన ఘటనను పూర్తిగా పక్కదోవ పట్టిస్తున్నారు. అది ఇవాళ్టి వివాదం కాదు. గత రెండేళ్లుగా ఆ గొడవ నడుస్తోంది. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవకు రాజకీయ రంగు పులుముతున్నారు. హత్య చేసిన యువకుడు రాజకీయాల్లో పెద్దగా క్రియాశీలకంగా లేడు. ఇవాళ ఆరోపణలు చేస్తున్న జగన్... రెండేళ్ల క్రితమే వివాదం తలెత్తినప్పుడు ఎందుకు న్యాయం వైపు నిలబడలేదు? నాడు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఈ వివాదంలో ఒక గ్రూపుకు కొమ్ము కాసి, మరో గ్రూపుపై తప్పుడు కేసులు పెట్టించి, కొట్టించి, ఇబ్బందులకు గురిచేశారు. ఆ పర్యవసానంగానే వినుకొండ ఘటన జరిగింది. వినుకొండలో జరిగిన ఘటనలో వాస్తవాలు అందరికీ తెలుసు. టీడీపీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారు" అంటూ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# చంద్రబాబు నంది అవార్డులు ఇస్తే ఇతడికి కూడా ఒకటివ్వాలి

### చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**విశ్వంభర, చంద్రగిరి :** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై దాడి కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అరెస్ట్ కు రంగం సిద్ధం అయిందని ఓవైపు వార్తలు వస్తుండగా... మరోవైపు మోహిత్ రెడ్డి తండ్రి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యే పులివర్తి నానిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి జరిగిందంటూ ఆనాడు పులివర్తి నాని డ్రామా ఆడాడని విమర్శించారు. పులివర్తి నాని ఆ రోజు సాయంత్రం 4.12 గంటలకు ధర్నా చేద్దామని ఎంతో ఉత్సాహంగా షర్ట్ వేసుకుని బయల్దేరాడని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. కానీ, 5.20 గంటలకు పరిస్థితి మారిపోయిందని... పులివర్తి నాని ఒంటిపై షర్ట్ మారిపోయిందని, టీషర్టు వచ్చిందని, కాలుకు కట్టు కూడా వచ్చిందని, చేతికి బ్యాండేజితో పాటు వీల్ చెయిర్ కూడా వచ్చిందని వివరించారు. "ఇతడు నాయకుడు ఎలా అవుతాడు... మంచి యాక్టర్ అవుతాడు గానీ! చంద్రబాబు నంది అవార్డులు ఇస్తే ఈయనకు కూడా ఒకటివ్వాలి. పబ్లిసిటీ కోసం అతను చేసిన యాక్టింగ్ వల్ల ఎస్సైలు సస్పెండ్ అయ్యారు, సీఐలు సస్పెండ్ అయ్యారు, డీఎస్పీలు సస్పెండ్ అయ్యారు, ఎస్పీ కూడా బదిలీ అయ్యాడు... ఏం చేస్తోంది పోలీస్ సంఘం?" అంటూ చెవిరెడ్డి ధ్వజమెత్తారు. "గతంలో పులివర్తి నాని క్వారీల్లో అధికారులు తనిఖీలకు వస్తే నన్ను సాయం అడగలేదా? నేను ఫోన్లో అధికారులతో మాట్లాడలేదా? రాజకీయం వేరు, వ్యాపారం వేరు. ఒకరి పొట్టకొట్టే పనులు చేయవద్దని ఆ



రోజు సదరు అధికారితో నేను మాట్లాడింది నిజం కాదా? నీ క్వారీ వద్దకు ఒక్క అధికారిని కూడా పోనివ్వకుండా ఆపింది నేను కాదా? నీకు 12 లారీలు ఉన్నాయి... గత ప్రభుత్వ హయాంలో ఒక్క లారీ అయినా ఆగిందా? వెంకటేశ్వరస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను... ఏనాడూ పులివర్తి నానిని శత్రువులా భావించలేదు... ఓ రాజకీయ ప్రత్యర్థిగా మాత్రమే చూశాను... కానీ చంద్రబాబు దగ్గర నన్ను విలన్ గా చూపించి పులివర్తి నాని పదవులు పొందాలని చూస్తున్నారు" అంటూ చెవిరెడ్డి పేర్కొన్నారు.

# 'ఇక పోరాడదాం.. గట్టిగా హెచ్చరికలు పంపాలి'

- పార్లమెంటరీ పార్టీ సమావేశంలో జగన్ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, కడప:** ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరగుతున్నాయని తెలిపారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన ఇందుకు పరాకాష్ఠ అని అన్నారు. ఏపీలో హింసాత్మక ఘటనలపై పార్లమెంటులో గళమెత్తాలని



చెప్పారు. 15 ఏళ్లుగా వైసీపీని చంద్రబాబు ఆశించినట్టుగా అణగదొక్కలేకపోయారని అన్నారు. రాష్ట్రపతి పాలనకు పార్లమెంటులో డిమాండ్ చేయాలని చెప్పారు. చంద్రబాబు నాయుడికి గట్టిగా హెచ్చరికలు పంపాలని అన్నారు. ఒకవేళ పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదని చెప్పారు. తాము కూడా అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామని అన్నారు. మంగళవారం నాటికి ఢిల్లీకి తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్యమైన నాయకులు వస్తారని తెలిపారు. బుధవారం నిరసన తెలుపుతామని వివరించారు. ఏపీలో జరుగుతున్న దారుణాలను దేశ ప్రజలకు చూపుతామని చెప్పారు. ఏపీలో జరుగుతున్న ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని అన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బగా భావించాలని చెప్పారు.



## సింగపూర్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విశ్వంభర, పిఠాపురం:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తన భార్య అన్నా లెజినోవా గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనడానికి సింగపూర్ వెళ్లారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ నుంచి పవన్ భార్య అన్నా లెజినోవా ఇవాళ 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్' పట్టా పొందారు. ఆ వర్సిటీ స్నాతకోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. యూనివర్సిటీలో పీజీ పట్టా అందుకున్నాక పవన్ తో కలిసి అన్నా లెజినోవా ఫొటోలు దిగినట్లు తెలుస్తోంది. కొన్ని నెలలుగా రాజకీయాల్లో బిజీగా ఉంటున్న పవన్ కల్యాణ్ ఇవాళ సింపుల్‌గా ఫార్మల్ లుక్ లో కనపడడం అభిమానులను అలరిస్తోంది. ఇటీవల పవన్, అన్నా లెజినోవా ఎయిర్‌పోర్టులో కనపడ్డారు. అన్నాను పవన్ కల్యాణ్ 2013లో పెళ్లి చేసుకున్నారు. పవన్ కల్యాణ్ కొన్ని వారాల క్రితమే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయన సినిమాల్లో తక్కువగా నటిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయన నటించిన ఓజీ, హరిహర వీరమల్లు సినిమాలు విడుదల కావాల్సి ఉంది.

## ఏపీ వ్యాప్తంగా వర్షాలు.. జనసేన శ్రేణులకు నాగబాబు కీలక సూచనలు



**విశ్వంభర, రాజమండ్రి:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాతోపాటు శ్రీకాకుళం, విశాఖపట్టణం, పార్వతీపురం మన్యం, ఉమ్మడి విజయనగరం జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీనికితోడు నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు వరదనీటిలో ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఎడతెరిపి లేని వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు పార్టీ శ్రేణులకు కీలక సూచన చేశారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నారు.. ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమై సహాయక చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అండగా ఉంటూ సహాయక చర్యల్లో అధికారులకు సహకరించాలని జనసేన నాయకులు, కార్యకర్తలను నాగబాబు కోరారు. తాగునీరు, ఔషదాలు, ఆహారం అందించాలని సూచించారు.

## దేశ వ్యాప్తంగా ఈ ఇష్యూను లేవనెత్తుతాం: వైసీపీ ఎంపీ అయోధ్య రామిరెడ్డి

**విశ్వంభర, గుంటూరు:** కూటమి ప్రభుత్వ అరాచకాలపై చర్చించామని వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. దాడులను ఆపేలా దేశ వ్యాప్తంగా ఇష్యూను లేవనెత్తుతామని చెప్పారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ దాడుల సంస్కృతిని పార్లమెంటులో లేవనెత్తుతామని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినప్పటికీ తమ పార్టీ బలంగా ఉంటుందని అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఇటువంటి ఘటనలతో ప్రజల్లో భయాందోళనలు కలుగుతున్నాయని చెప్పారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ ను గాడిలో పెట్టాలని అన్నారు. అధికారంలో ఉన్నవారు ఇలాంటి దాడులను ఆపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిస్థితి ఇలానే ఉంటే మరిన్ని దాడులు జరుగుతాయని అన్నారు. రాజకీయ పార్టీలు అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని అయోధ్య రామిరెడ్డి చెప్పారు. సోమవారం జరిగే అసెంబ్లీలో నిరసన తెలియజేస్తామని అన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రిని కలిసి ఈ దాడుల గురించి వివరిస్తామని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ఇలాంటి సంస్కృతి మంచిదికాదని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లలో తామెక్కడా ఇలాంటి దాడులకు పాల్పడలేదని అన్నారు.

## హార్దిక్ పాండ్యాకు కోచ్ గంభీర్ ఫోన్ కాల్.. సున్నితంగా స్ట్రాంగ్ మెసేజ్!



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 వరల్డ్ కప్ 2024ను గెలిచిన భారత్ జట్టులో భాగమైనప్పటికీ స్టార్ ఆల్ రౌండర్ హార్ధిక్ పాండ్యా ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో ఇబ్బంది పడుతున్నాడు. తన భార్య నటాసా స్టాంకోవిచ్‌కు విడాకులు ఇచ్చినట్టు రెండు రోజుల క్రితమే ప్రకటించాడు. ఇక టీ20 వరల్డ్ కప్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన పాండ్యాను శ్రీలంక టూర్‌కు కేవలం జట్టులో ఒక ఆటగాడిగా మాత్రమే సెలక్టర్లు ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది. సూర్యకుమార్ యాదవ్‌కు టీ20 సిరీస్ కెప్టెన్సీని అప్పగించిన సెలక్టర్లు వైస్ కెప్టెన్‌గా యంగ్ ప్లేయర్ శుభ్‌మాన్ గిల్‌కు అవకాశం ఇచ్చారు. ఈ పరిణామం హార్ధిక్ పాండ్యాకు ఏమాత్రం రుచించదని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక వన్డే జట్టులో హార్ధిక్ పాండ్యాకు చోటు దక్కకపోవడంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతున్న వేళ ఆసక్తికరమైన కథనం ఒకటి వెలుగులోకి వచ్చింది. వన్డేల్లో పాండ్యా స్థానానికి గ్యారెంటీ లేదని 'హిందుస్థాన్ టైమ్స్' కథనం పేర్కొంది. కోచ్ గౌతమ్ గంభీర్ హార్ధిక్ పాండ్యాకు ఫోన్ చేసి తన బౌలింగ్ ఫిట్‌నెస్‌ని నిరూపించుకోవడానికి విజయ్ హజారే ట్రోఫీ ఆడాలని సూచించినట్టు తెలుస్తోందని కథనం తెలిపింది. ఈ మేరకు బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారని పేర్కొంది. "హార్ధిక్‌కి గంభీర్ ఫోన్ చేశారు. వన్డేలలో పాండ్యా పూర్తిస్థాయి బౌలింగ్ కోటాను పూర్తి చేయాలని గంభీర్ ఎదురుచూస్తున్నారు. ఇదే విషయాన్ని ఫోన్ సంభాషణలో చెప్పారు" అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పినట్టు 'హిందుస్థాన్ టైమ్స్' కథనం వివరించింది.

### పాండ్యాకు కెప్టెన్సీ ఇవ్వాల్సింది: మహ్మద్ కైఫ్

**టీమిండియా మాజీ స్టార్ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. శ్రీలంక పర్యటనలో పాండ్యాకు టీ20 జట్టు కెప్టెన్సీ ఇవ్వాల్సిందని అన్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు రెండేళ్ల పాటు కెప్టెన్‌గా వ్యవహరించాడని, తొలి సీజన్‌లోనే ఫైనల్ చేర్చి జట్టుని గెలిపించాడని కైఫ్ గుర్తుచేశాడు. హార్దిక్‌కు టీ20 కెప్టెన్‌గా అనుభవం ఉంది కాబట్టి అతడికి ఇచ్చి ఉండే బాగుండేదని వ్యాఖ్యానించాడు. టీ20 ప్రపంచ కప్‌లో వైస్కెప్టెన్‌గా వ్యవహరించాడని గుర్తుచేశాడు.**



## ఈ నెల 22న శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న టీమిండియా

- శ్రీలంకలో 3 టీ20లు, 3 వన్డేలు ఆడనున్న టీమిండియా
- జులై 27 నుంచి టీ20 సిరీస్, ఆగస్టు 2 నుంచి వన్డే సిరీస్
- టీ20ల్లో ఆడే టీమిండియా కెప్టెన్ గా సూర్యకుమార్ యాదవ్
- వన్డేల్లో రోహిత్ సారథ్యం
- శ్రీలంక పర్యటన ద్వారా టీమిండియా కోచ్ గా బాధ్యతలు చేపట్టనున్న గంభీర్

**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20, వన్డే సిరీస్ లు ఆడేందుకు టీమిండియా ఈ నెల 22న శ్రీలంక పయనం కానుంది. టీ20 సిరీస్ లో సూర్యకుమార్ టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, వన్డేల్లో ఎప్పట్లాగానే రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తాడు. ఇటీవల వరల్డ్ కప్ గెలిచిన అనంతరం టీ20 ఫార్మాట్ కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. కాగా, శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్ 27 నుంచి జరనుగంది. ఆగస్టు 2 నుంచి వన్డే మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ పర్యటనలో టీమిండియా 3 టీ20 మ్యాచ్ లు, 3 వన్డేలు ఆడనుంది. కాగా, టీమిండియా కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఈ పర్యటనతోనే బాధ్యతలు అందుకోనున్నాడు. జులై 22న దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

## సానియా మీర్జాతో పెళ్లి వార్తలపై మొహమ్మద్ షమీ స్పందన

- షమీ, సానియా పెళ్లి చేసుకుంటున్నారంటూ కొంత కాలంగా ప్రచారం
- ఇది కేవలం రూమర్ అని చెప్పిన షమీ
- తప్పుడు వార్తలు ప్రచారం చేయవద్దని విన్నపం



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీమిండియా స్టార్ క్రికెటర్ మొహమ్మద్ షమీ, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా పెళ్లి చేసుకోబోతున్నారంటూ కొంత కాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రచారంలో నిజం లేదని సానియా తండ్రి వివరణ ఇచ్చినప్పటికీ... ప్రతి చోట వీరి పెళ్లి ప్రస్తావన వస్తోంది. తాజాగా ఈ వార్తపై షమీ స్పందించాడు. యూట్యూబ్ లో జర్నలిస్టు శుభాంకర్ మిశ్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమీ ఈ విషయంపై మాట్లాడుతూ... సానియాతో తన పెళ్లి అనేది కేవలం రూమర్ మాత్రమేనని చెప్పాడు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని... ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయడాన్ని ఆపేయాలని కోరారు. మీ సరదా కోసం ఇతరుల వ్యక్తిగత జీవితాలను, మనోభావాలను దెబ్బతీయకూడదని చెప్పాడు. మీమ్స్ అనేవి వినోదం కోసమేనని... అబద్ధాలను ప్రచారం చేయడం కోసం కాదని తెలిపాడు. వీలైతే మీ వంతుగా ప్రజలకు సహాయం చేయండి, మిమ్మల్ని మీరు మార్చుకోండి, అప్పుడే ఈ సమాజంలో మీరొక మంచి వ్యక్తిగా జీవించగలరని చెప్పాడు.

## కోచ్ గౌతమ్ గంభీర్ సహాయ సిబ్బంది ఖరారు!



**విశ్వంభర, స్పోర్ట్స్** : భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సహాయ కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోస్చాట్‌లను నియమించేందుకు బీసీసీఐ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. టీమ్ మేనేజ్‌మెంట్ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయక పోయినప్పటికీ శ్రీలంకతో జరగనున్న టీ20, వన్డే సిరీస్‌ల నుంచి వీరిద్దరూ గంభీర్‌తో కలిసి బాధ్యతలు స్వీకరిస్తారని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. కాగా అభిషేక్ నాయర్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా ఉన్నాడు. ఇక ఐర్లాండ్ మాజీ ఆటగాడైన ర్యాన్ టెన్ డోస్చాట్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు గతంలో ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. మరోవైపు రాహుల్ ద్రావిడ్ ఆధ్వర్యంలో ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేసిన తెలుగు వ్యక్తి టి.దిలీప్‌ను కూడా నూతన సహాయక సిబ్బందిలో కొనసాగించాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. కాగా బౌలింగ్ కోచ్ నియామకంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్‌ను బలమైన పోటీదారుగా బీసీసీఐ పరిగణిస్తున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఆడినప్పుడు మోర్కెల్‌తో గంభీర్ కలిసి పనిచేశాడు. 2014, 2016 ఐపీఎల్ సీజన్లలో గంభీర్ కెప్టెన్సీలో మోర్కెల్ ఆడాడు.బౌలింగ్ కోచ్‌పై స్పష్టత రానప్పటికీ దిలీప్, అభిషేక్ నాయర్‌లతో కలిసి కోచ్ గంభీర్ శ్రీలంక పర్యటనకు వెళ్లనున్నాడని 'క్రిక్‌బజ్' కథనం పేర్కొంది. కాగా ర్యాన్ టెన్ డోస్చాట్ జట్టుతో ఎప్పుడు కలుస్తాడనేది తెలియరాలేదు. ప్రస్తుతం జరుగుతున్న 'మేజర్ లీగ్ క్రికెట్'లో ఎల్ఏ నైట్ రైడర్స్ కోచింగ్ స్టాఫ్‌లో సభ్యుడిగా ర్యాన్ టెన్ పనిచేస్తున్నాడు.

## చరిత్ర సృష్టించిన లేడీ కోహ్లీ.. ఆ ప్లేయర్ రికార్డ్ బద్దలు

**విశ్వంభర, స్పోర్ట్స్** : మహిళల ఆసియా కప్ 2024లో భారత్ తరపున స్మృతి మంధాన అత్యధిక పరుగులు చేసింది. దీంతో టోర్నీ తొలిరోజే భారత్‌పాకిస్థాన్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ధీటుగా బ్యాటింగ్ చేసి తుఫాను ఇన్నింగ్స్ ఆడింది. తన బలమైన ఇన్నింగ్స్‌లో, స్మృతి తన పేరిట ప్రత్యేక రికార్డును కూడా సృష్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను వెనుక్కు నెట్టేసింది. నిజానికి, టీమ్ ఇండియా తరపున మహిళల T20 ఇంటర్నేషనల్‌లో అత్యధిక పరుగుల రికార్డు ఇప్పటి వరకు హర్మన్‌ప్రీత్ కౌర్ పేరిట ఉంది. అయితే స్మృతి మంధాన పాకిస్తాన్‌పై 31 బంతుల్లో 45 పరుగుల ఇన్నింగ్స్‌తో దానిని అధిగమించగలిగింది. మంధాన 137 మ్యాచ్‌ల్లో 3365 పరుగులు చేయగా, హర్మన్‌ప్రీత్ 170 మ్యాచ్‌ల్లో 3349 పరుగులు చేసింది. భారత మహిళల జట్టు తరపున టీ20 ఇంటర్నేషనల్‌లో అత్యధిక పరుగులు చేసిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మూడో స్థానంలో ఉంది. మిథాలీ 89 మ్యాచ్‌ల్లో 2364 పరుగులు చేసింది. అదే సమయంలో, జెమిమా రోడ్రిగ్స్ 96 మ్యాచ్‌ల్లో 2000 పరుగులతో నాలుగో స్థానంలో ఉంది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనే జెమీమా రెండు వేల పరుగుల స్కోరును సాధించింది. 77 మ్యాచ్‌ల్లో 1788 పరుగులు చేసిన షెఫాలీ వర్మ ఐదో స్థానంలో ఉంది.7 సార్లు ఛాంపియన్ అయిన భారత జట్టు మహిళల ఆసియా కప్ 2024ను కూడా అట్టహాసంగా ప్రారంభించింది. మొదటి మ్యాచ్‌లోనే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. అది సరైనది కాదని తేలింది. పాక్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచి తడబడింది. ఏ బ్యాటర్ కూడా భారీ స్కోరు చేయలేకపోయారు. ఈ కారణంగా ఆ జట్టు మొత్తం ఓవర్లు ఆడకుండానే 19.2 ఓవర్లలో 108 పరుగులకే పరిమితమైంది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 14.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసి విజయం సాధించింది. స్మృతి మంధాన అత్యధిక స్కోరు 45 పరుగులు చేయగా, షెఫాలీ కూడా 40 పరుగులు చేసింది.



## మూడు సవాళ్లతో సూర్య 'లంక' దాటేనా?



**విశ్వంభర, స్పోర్ట్స్** : శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత జట్టును బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం టీమ్ ఇండియా మరికొద్ది రోజుల్లో లంకకు వెళ్లనుంది. టీ20 సిరీస్‌తో ఈ టూర్ ప్రారంభం కానుంది. కొత్త కెప్టెన్‌గా ఎంపికైన సూర్యకుమార్ యాదవ్‌కు ఈ పర్యటన చాలా కీలకం. టీ20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించిన రోహిత్ శర్మను భర్తీ చేయడం సూర్యకి అంత తేలికైన విషయం కాదు. దాంతో పాటు టీ20 కెప్టెన్సీ రేసులో ఉన్న ఇతర ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ జట్టును నడిపించాల్సిన గురుతర బాధ్యత సూర్యపై ఉంది. ఇంత జరిగినా, కెప్టెన్‌గా సూర్య తన లంక పర్యటనలో మూడు కఠినమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. 33 ఏళ్ల సూర్యకుమార్‌కు పెద్ద టోర్నీల్లో జట్టుకు నాయకత్వం వహించిన అనుభవం లేకపోవడం కెప్టెన్‌గా సూర్యకు ఉన్న మొదటి సవాలు. సూర్య ఇప్పటి వరకు కేవలం 7 టీ20 మ్యాచ్‌లకు మాత్రమే కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో ఐదు మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. సూర్య నాయకత్వంలో ఆ జట్టు ఆస్ట్రేలియాను స్వదేశంలో జరిగిన సిరీస్‌లో 41 తేడాతో ఓడించింది. దీని తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనతో టీ20 సిరీస్‌ను 11తో సమం చేసింది. ప్రస్తుతం సూర్య నాయకుడిగా సక్సెస్ అయినప్పటికీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏ మేరకు నిలబెట్టుకుంటాడో ఆరు నెలల్లో తేలిపోనుంది. రోహిత్ శర్మ స్థానాన్ని భర్తీ చేయడం సూర్యకి ఉన్న రెండో సవాలు. రోహిత్ శర్మ కెప్టెన్‌గా చాకచక్యంతో పాటు డ్రెస్సింగ్ రూమ్‌లోని వాతావరణాన్ని ఆహ్లాదకరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం జట్టులో నాయకత్వానికి ఉవ్విళ్లూరుతున్న ఆటగాళ్ల మధ్య సూర్య జట్టును ఎలా నడిపిస్తాడన్నది పెద్ద ప్రశ్నగా మారింది. మూడో ఛాలెంజ్ ఏంటంటే... మిడిలార్డర్ బ్యాట్స్ మెన్‌గా జట్టును విజయపథంలో నడిపించే ముఖ్యమైన పనితోపాటు కెప్టెన్‌గా కూడా సూర్య జట్టును ముందుకు తీసుకెళ్లాలి. క్రీడాకారులందరి ఆటతీరును మెరుగుపరచడంతోపాటు తన ఆటతీరును మెరుగుపర్చాల్సిన గురుతర బాధ్యత సూర్యకుమార్‌పై ఉంది. సూర్య కెప్టెన్‌గా ఇప్పటి వరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌మెన్‌గా మంచి ప్రదర్శన చేశాడు. ఈ 7 మ్యాచ్‌ల్లో సూర్య ఒక సెంచరీ, రెండు అర్ధసెంచరీలతో 42.85 సగటుతో మొత్తం 300 పరుగులు చేశాడు. పూర్తి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన యాదవ్ ఇప్పుడు తన ఫామ్‌ను ఎలా కొనసాగిస్తాడో చూడాలి. ఇన్ని సవాళ్ల మధ్య సూర్య తన కెప్టెన్సీలో జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమైతే, అతడిని ఎప్పుడైనా కెప్టెన్సీ నుంచి తప్పించవచ్చని బీసీసీఐ పేర్కొంది. కనుక జట్టును విజయపథంలో నడిపించడంలో సూర్య సఫలమైతే, 2026లో జరిగే తదుపరి టీ20 ప్రపంచకప్ వరకు కెప్టెన్‌గా కొనసాగుతాడు. లేదంటే సూర్య తన నాయకత్వాన్ని మరొకరికి అందిచాల్సి ఉంటుంది.


## యూపీఐ పేమెంట్లకు ఎనలేని ఆదరణ

- ప్రతి నెలా జత కలుస్తున్న 60 లక్షల మంది నూతన యూపీఐ చెల్లింపుదార్లు
- ఏడాది ప్రాతిపదికన 49 శాతం మేర పెరిగిన పేమెంట్లు
- రోజువారీగా యూపీఐ చెల్లింపుల మొత్తం విలువ రూ.66,903 కోట్లు
- గణాంకాలు విడుదల చేసిన ఎన్‌పీసీఐ




**విశ్వంభర, బిజినెస్:** దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు అంతకంతకూ వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పేమెంట్లకు ఎనలేని ఆదరణ పెరుగుతోంది. ప్రతి నెలా ఏకంగా 60 లక్షల మంది నూతన వినియోగదారులు యూపీఐ చెల్లింపులు మొదలుపెడుతున్నారని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) డేటా పేర్కొంది. ఈ మేరకు జూన్ నెల డేటాను ప్రకటించింది. ఏడాది ప్రాతిపదికన యూపీఐ లావాదేవీల సంఖ్య ఏకంగా 49 శాతం మేర పెరిగి 13.9 బిలియన్లకు చేరిందని తెలిపింది. ఇక లావాదేవీల విలువ 36 శాతం పెరిగి రూ.20.1 లక్షల కోట్లకు చేరిందని ప్రకటించింది. రోజువారీ యూపీఐ లావాదేవీల సంఖ్య 463 మిలియన్లు ఉంటుందని, రోజువారీ పేమెంట్ల సగటు విలువ రూ.66,903 కోట్లుగా ఉంటుందని ఎన్‌పీసీఐ పేర్కొంది. యూపీఐపై రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు అవకాశం ఇవ్వడం, విదేశీ దేశాలలో సైతం యూపీఐ సేవలను ప్రారంభించడంతో యూపీఐ చెల్లింపులు భారీగా పెరిగేందుకు దోహదపడింది. ఈ పరిణామంపై ఎన్‌పీసీఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణా రాయ్ స్పందించారు. రూపే క్రెడిట్ కార్డుల మార్కెట్ వాటా మూడేళ్ల క్రితం కేవలం 1 శాతంగా ఉండగా ఇప్పుడు 10 శాతానికి పెరిగిందని ప్రస్తావించారు.కాగా భారత్‌లో యూపీఐ చెల్లింపుల వ్యవస్థను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఈ మేరకు ప్రపంచ దేశాలకు భారత్ సహకారం అందిస్తోంది. ఇటీవలే యూఏఈలోని 'అల్ మాయా సూపర్‌మార్కెట్' దేశంలోని తన స్టోర్లలో యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద కూడా యూపీఐ పేమెంట్లు అందుబాటులో ఉన్నాయని ఎన్‌పీసీఐ నాన్‌ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అజయ్ కుమార్ చౌదరి ప్రస్తావించారు. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఈ పేమెంట్లకు మరింత ఆదరణ పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే సంవత్సరాల్లో రోజుకు 1 బిలియన్ యూపీఐ లావాదేవీలను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆయన చెప్పారు.

## 5 డోర్లతో మహీంద్రా నుంచి సరికొత్త 'థార్ రాక్స్'



**విశ్వంభర, బిజినెస్** : దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ మార్కెట్లో మరో సరికొత్త వాహనం ఆవిష్కరణకు సిద్ధమైంది. 5 డోర్లతో 'మహీంద్రా థార్ రాక్స్'ను విడుదల చేయబోతున్నట్టు శనివారం ప్రకటించింది. దీనిని ఆగస్టు 15న ఆవిష్కరించబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కారు టీజర్‌ను విడుదల చేసింది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే తేదీన 'థార్'ను మార్కెట్‌లో ప్రవేశపెట్టామని పేర్కొంది. 'థార్ రాక్స్'లో కొత్త రెండు డోర్లు జత చేశామని, కారు పొడవు, వీల్‌బేస్ పెరిగాయని కంపెనీ వివరించింది. 'థార్ రాక్స్' డిజైన్‌ను కూడా ఆధునికీకరించామని వివరించింది. సర్క్యులర్ హెడ్‌లైట్లు, గ్రిల్ కూడా కొత్తవేనని తెలిపింది. కాగా కొన్ని మార్పులతో వచ్చినప్పటికీ నాలుగేళ్ల క్రితం విడుదలైన మహీంద్రా ఎస్‌యూవీ 'థార్'కు చెందినదే అనే భావం కలుగుతోంది.

**ధర రూ.13 లక్షల నుంచి ప్రారంభం!**

మహీంద్రా థార్ రాక్స్ ఆరంభ ధర సుమారు రూ.13 లక్షల నుంచి ప్రారంభమవ్వొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఇక గరిష్ఠ ధర ఎక్స్‌షోరూమ్‌లో రూ.25 లక్షల వరకు ఉండొచ్చని కథనాలు పేర్కొంటున్నాయి. ఇక థార్ 5డోర్ ప్రత్యేకతల విషయానికి వస్తే... 2.0 లీటర్ టర్బో పెట్రోల్ మోటార్, 2.2లీటర్ డీజిల్ ఇంజన్ రెండు ఇంజన్ ఆప్షన్లకు అవకాశం ఉంది. 6స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లకు ఛాన్స్ ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. థార్ రాక్స్ ఒక 4x4 డ్రైవ్‌ట్రెయిన్, తక్కువ నిష్పత్తిలో గేర్‌బాక్స్, వెనుక యాక్సిల్‌కు మెకానికల్ లాకింగ్ డిఫరెన్షియల్, ఫ్రంట్ యాక్సిల్‌కు బ్రేక్‌లాకింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయని తెలుస్తోంది. మార్కెట్లో ధరలను పోటీగా ఉంచేందుకుగానూ టూవీల్ డ్రైవ్ వేరియంట్‌లను కూడా మహీంద్రా కంపెనీ ఆఫర్ చేయవచ్చునని కథనాలు పేర్కొంటున్నాయి.

## వాళ్లవి నాసిరకం ఉత్పత్తులు.. మైక్రోసాఫ్ట్‌పై స్టీవ్ జాబ్స్ విమర్శల వైరల్

**విశ్వంభర, బిజినెస్** : విండోస్ క్రాష్ ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలపై ప్రభావం చూపించింది. ఆర్థిక రంగం నుంచి వైమానిక రంగం వరకూ కంప్యూటర్లు మొరాయించడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో, మైక్రోసాఫ్ట్ సేవాలోపంపై నెట్టింట విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా యాపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ 1995లో మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులపై గుప్పించిన ఘాటు విమర్శలు వైరల్‌గా మారాయి. మైక్రోసాఫ్ట్ థర్డ్ రేట్ (నాసిరకం) ఉత్పత్తులను తయారు చేస్తుందని స్టీవ్ జాబ్స్ మండిపడ్డారు. "మైక్రోసాఫ్ట్‌తో ఉన్న ఒకే ఒక సమస్య ఏంటంటే వాళ్లకు మంచి అభిరుచి లేనేలేదు. నేను ఇదేమీ ఆషామాషీగా చెప్పడం లేదు. వాళ్లకు కొత్త ఆలోచనలు లేవు. వాళ్లు తమ ఉత్పత్తులకు కొత్త సంస్కృతిని జోడించలేరు. ఇది చాలా తీవ్రమైన విషయం. ఉదాహరణకు ఇంగ్లీష్‌లో అందమైన ఫాంట్‌స్‌కు, టైప్ సెట్టింగ్స్, పుస్తకాలే స్ఫూర్తి. అసలు మాక్ అనేదే లేకపోతే మైక్రోసాఫ్ట్ వాటిల్లో ఈ ఫాంట్స్ ఉండేవే కావు. కాబట్టి, నాకు మైక్రోసాఫ్ట్‌ను చూస్తే విచారం కలుగుతుంది. మైక్రోసాఫ్ట్ విజయాలపై నాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. వాళ్లు ఆ విజయాలకు అర్హులే. కానీ వాళ్లు అన్నీ థర్డ్ రేట్ ఉత్పత్తులు తయారు చేస్తారు. ఇది నాకు ఇబ్బందిగా అనిపిస్తుంది" అంటూ స్టీవ్ జాబ్స్ విమర్శించాడు. కాగా, మైక్రోసాఫ్ట్ శుక్రవారం సమస్యను పరిష్కరించింది. ఈ మేరకు ఓ ప్రకటన చేసింది. విండోస్ సిస్టమ్ షట్ డౌన్ అవుతూ బ్లూ స్క్రీన్ కనిపించడానికి కారణం ఓ సెక్యూరిటీ అప్‌డేట్ అని వివరించింది. మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులకు భద్రత అందించే క్రౌడ్ స్ట్రైక్ సంస్థ పంపించిన సెక్యూరిటీ అప్‌డేట్ ఈ క్రాష్‌కు కారణమైందని వివరించింది.

విశ్వంభర
V3 NEWS

# తెలుగులో కోటి రెమ్యునరేషన్ తీసుకున్న ఫస్ట్ హీరోయిన్



**విశ్వంభర, సినిమా:** తెలుగు సినీ పరిశ్రమలో మొదటిసారి రూ. కోటి రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ ఎవరో తెలుసా..? మొదటి సినిమాతోనే ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది. ఫస్ట్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ తక్కువ సమయం లోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది. తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడలోనూ పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. ఆ తర్వాత హిందీ సినీ రంగంలోకి అడుగుపెట్టింది. దశాబ్దానికి పైగా ఇండస్ట్రీలో సత్తా చాటిన హీరోయిన్ కు ఆ బ్యూటీకి అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో సినిమాలకు దూరమైంది. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ ఇలియానా. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన దేవదాసు సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగు పెట్టింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత రెండవ సినిమా ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు జోడిగా నటించే ఛాన్స్ అందుకుంది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మహేష్ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ పోకిరి సినిమాలో నటించింది. ఈ సినిమాతో ఇలియానా క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ తర్వాత ఇండస్ట్రీలో వరుస ఆఫర్స్ అందుకుంది. తెలుగులో స్టార్ హీరోస్ అందరి సరసన నటించి మెప్పించింది. అయితే మాస్ మహారాజా రవితేజ నటించిన ఖతర్నాక్ సినిమాకు ఇలియానా రూ. కోటి రెమ్యునరేషన్ తీసుకున్నట్లు అప్పట్లో వార్తలు వినిపించాయి. తెలుగులో మొదటిసారి కోటి రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ ఇలియానా అని అప్పట్లో పెద్ద చర్చే నడిచింది. ఈ సినిమా తర్వాత ఇలియానా తన నెక్స్ సినిమాలకు రూ.1.25 కోట్లు పెంచినట్లు సమాచారం. కానీ కొన్నాళ్లకు ఇలియానాకు తెలుగులో ఆఫర్స్ తగ్గిపోయాయి. ఆ తర్వాత నెమ్మదిగా హిందీలో ఆఫర్స్ అందుకుంది. కానీ అక్కడ కూడా వరుసగా ఆమె సినిమాలు డిజాస్టర్స్ కావడంతో సినిమాలకు దూరమైంది. కొన్నాళ్లపాటు సైలెంట్ అయిన ఇలియానా.. అనుహ్యంగా ప్రెగ్నెన్సీ అంటూ అనౌన్స్ చేసి షాకిచ్చింది. పెళ్లి విషయాన్ని దాచిపెట్టి నేరుగా ప్రెగ్నెన్సీ గురించి అభిమానులతో పంచుకుంది. ఆ తర్వాత తన భర్త, బాబు ఫోటోస్ షేర్ చేస్తూ వైవాహిక బంధం గురించి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం ఇలియానా తన బాబు, భర్తతో కలిసి విదేశాల్లో ఉంటుంది. అలాగో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ తన బాబు ఫోటోస్ షేర్ చేస్తుంది.




# నాని 'సరిపోదా శనివారం' టీజర్ వచ్చేసింది

టాలీవుడ్ స్టార్ హీరో నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ.. చాలా బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం అతను నటిస్తున్న మూవీ 'సరిపోదా శనివారం'. ఈ సినిమా నుంచి ఇప్పటివరకు వచ్చిన అప్డేట్స్ సినిమాపై ఆసక్తిని పెంచగా.. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ హైప్ ను క్రియేట్ చేస్తుంది. ఈ టీజర్ విడుదలైన కొద్ది క్షణాల్లోనే మంచి వ్యూస్ ను రాబట్టి ట్రెండింగ్ లోకి వెళ్ళిపోయింది. ఈ టీజర్ ప్రారంభంలోనే జనాలు పరిగెత్తుతూ కనిపిస్తారు. ఎస్జే. సూర్య పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తాడు. గూస్ బంప్స్ తెప్పిస్తున్న మ్యూజిక్ జనాలను భయపెడుతుంది. పోలీస్ గా ఉన్న సూర్య జనాలను కొడుతూ, హింసిస్తూ కనిపిస్తాడు. అప్పుడే నాని, హీరోయిన్ ఎంట్రీ తో ఇస్తాడు. అక్కడ భారీ ఫైట్ జరుగుతుందని బ్యాగ్రౌండ్ చూస్తే తెలుస్తుంది. అప్పుడు నాని హ్యాపీ బర్త్ డే సార్ అని చెబుతాడు. ఇవాళ ఎస్.జె. సూర్య బర్త్ డే సందర్భంగా సూర్య కు హ్యాపీ బర్త్ డే అని చెబుతూ టీజర్ ను ఎండ్ చేశారు. ఈ టీజర్ చూస్తుంటే భారీ ఫైట్స్ ఉన్నట్లు తెలుస్తుంది. ఈ టీజర్ లో నాట్ ఏ టీజర్ కనిపించడం విశేషం.

# బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకున్న సితార



సూపర్ స్టార్ మహేశ్‌బాబు కూతురు సితార పుట్టినరోజు నేడు. 2024 జూలై 20న సితార 12వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఆమె పుట్టిన రోజు వేడులకను ఘనంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఓ ఫోటోను నమ్రతా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'అందమైన కూతురికి పుట్టిన రోజు శుభాకాంక్షలు. నువ్వు కనే కలలు నిజం అవ్వాలని కోరుకుంటున్నారు. నీ మనసు బంగారం తల్లీ.' అంటూ ఆ ఫోటో కింద రాసుకొచ్చింది. కాగా.. ఈ ఉదయమే సితారకు మహేశ్ బాబు, నమ్రతలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 'హ్యాపీ 12 మై సన్‌షైన్' అని మహేశ్ పోస్ట్ చేశారు. నమ్రత ఇన్‌స్టా వేదికగా ఓ స్పెషల్ వీడియో షేర్ చేశారు. సితార చిన్నప్పటి ఫొటోలు, వీడియోలతో దీనిని క్రియేట్ చేశారు. 'నా చిట్టి ప్రయాణ సహచరురాలికి జన్మదిన శుభాకాంక్షలు. వివిధ దేశాలు, లెక్కలేనన్ని జ్ఞాపకాలు.. నువ్వు ఎల్లప్పుడూ నాకొక ట్రావెల్ గైడ్‌లా ఉంటూ ప్రతి ప్రయాణాన్ని ప్రత్యేకం చేశావు. ఈ క్షణాలు, జ్ఞాపకాలను సెలబ్రేట్ చేసుకుంటున్నా. ఐ లవ్ యూ మై స్వీట్‌హార్ట్'' అని రాసుకొచ్చింది.





# సైమాకు నామినేట్ అయిన 'పిండం'

సినిమా రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే అవార్డులో సైమా ఒకటి. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ పేరుతో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ చిత్ర పరిశ్రమకి చెందిన టెక్నీషియన్స్‌ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ అవార్డులను ప్రారంభించిన విషయం తెలిసిందే. 12 ఏళ్లుగా విజయవంతంగా ఈ పురస్కారాల వేడుకలు జరుగుతున్నాయి. ఈ అవార్డును అందుకోవడం గౌరవంగా భావిస్తుంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా సైమా అవార్డులకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 14,15 తేదీల్లో దుబాయ్ వేదికగా ఈ వేడుక జరగనుంది. దీంతో ఇప్పటికే ఈ అవార్డులు దక్కించుకునేందుకు పోటీ పడుతున్న చిత్రాల జాబితాను 'సైమా' టీమ్ తాజాగా విడుదల చేసింది. ఇందులో భాగంగా ఓ చిన్న సినిమా నామినేట్ కావడం విశేషం. ఆ సినిమా మరేదో కాదు పిండం. 2023 డిసెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను తెగ భయపెట్టేసిందని చెప్పాలి. థియేటర్లతో పాటు ఓటీటీలోనూ పిండం మూవీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన ఈ హారర్ చిత్రానికి సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా సైమా అవార్డుల్లో ఉత్తమ తొలి చిత్ర నిర్మాత విభాగంలో నామినేషన్ పొందింది. బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్ విభాగంలో ఈ సినిమా ఎంపికైనట్లు సైమా తెలిపింది. దీనిపై పిండం చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేసింది. సైమాకు సినిమా ఎంపిక కావడంపై మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి యశ్వంత్ దగ్గుమాటి నిర్మాణ బాధ్యతలు వహించిన విషయం తెలిసిందే. సినిమాల్లోకి రాకముందు యశ్వంత్ దగ్గుబాటి అమెరికాలోని కార్పొరేట్ రంగంలో పేరు తెచ్చుకున్నారు. అక్కడే దర్శకుడు సాయి కిరణ్‌ను కలిసిన యశ్వంత్.. పిండం సినిమా తీయాలని నిర్ణయించుకున్నారు. ఇక ఈ సినిమా తీసే సమయంలో ఎదురైన సవాళ్లను ఎదుర్కొని చిత్రాన్ని పూర్తి చేసినట్లు నిర్మాత చెప్పుకొచ్చారు. మరి పిండం చిత్రానికి ఈ అవార్డు లభిస్తుందో లేదో చూడాలి. ఇదిలా ఉంటే పిండంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసిన దర్శకుడు సాయి కిరణ్ మరో చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. కళాహి మీడియా ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరి నాటికి సెట్స్ పైకి తీసుకెళ్లే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుంది.

# భారత్‌లో పురుషుల్లో కన్నా మహిళల్లోనే తీవ్ర ఒత్తిడి!

**విశ్వంభర, ఫీచర్ :** మానసిక ఆరోగ్యంపై అధ్యయనం ఇప్పటికే అనేక మందిలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టుగా ధృవీకరించింది. ముఖ్యంగా భారత్‌లో వర్క్ చేసే స్త్రీలు పురుషుల కన్నా ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారు. "ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ ఆఫ్ ఎంప్లాయీస్" పేరుతో లేటెస్ట్ రిపోర్టు ప్రకారం.. యువర్‌దోస్ట్ 5వేల కన్నా ఎక్కువ మంది భారతీయ నిపుణులను సర్వే చేసింది. ఈ కార్యాలయంలో ఒత్తిడికి సంబంధించిన కొన్ని విషయాలను గుర్తించింది. 5వేల కన్నా ఎక్కువ మంది ప్రతివాదుల నుంచి అభిప్రాయాలను సేకరించిన తర్వాత మానసిక ఆరోగ్య ప్లాట్‌ఫారమ్ యువర్‌దోస్ట్ పని ప్రదేశాలలో పురుషుల కన్నా స్త్రీలు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నట్లు కనుగొన్నారు.



**18శాతం మహిళల్లో తీవ్ర మానసిక ఒత్తిడి :**
దాదాపు మూడు వంతులు లేదా 72.2శాతం మంది మహిళా ప్రతివాదులు అధిక ఒత్తిడి స్థాయిలను నివేదించారు. దీనికి విరుద్ధంగా, పురుషులను అదే ప్రశ్న అడిగినప్పుడు.. వారిలో 53.64శాతం మంది అధిక ఒత్తిడి స్థాయిలను అనుభవిస్తున్నారని చెప్పారు. అధిక శాతం స్త్రీలు కూడా పనిపరంగా జీవిత సమతుల్యత లోపాన్ని నివేదించారు. 12శాతం మంది పురుషులతో పోలిస్తే.. 18శాతం మంది మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకు అధికంగా కష్టపడుతున్నారని పేర్కొన్నారు. అధిక పనిభారం కలిగిన మహిళల్లో ఒత్తిడికి ప్రధాన కారణాలలో ఒకటిగా చెప్పవచ్చు. ఇందులో పనికి తగిన గుర్తింపు లేకపోవడం, తక్కువ నైతికత, భయాందోళనలు వంటివి ఉన్నాయి. 9.27శాతం మంది పురుషులతో పోలిస్తే.. 20శాతం మంది మహిళలు ఎల్లప్పుడూ తీవ్ర ఒత్తిడిని కలిగి ఉన్నట్లు నివేదించారు.

**అత్యంత ఒత్తిడికి లోనైన వయస్సు గ్రూపులివే :**
ఉద్యోగుల ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ నివేదిక ప్రకారం.. 21 ఏళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న ఉద్యోగులు, కార్మికులలో అత్యంత ఒత్తిడికి గురవుతున్నారు. 21 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల 64.42శాతం మంది కార్మికులు అధిక స్థాయి ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు నివేదించారు. 31 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల 59.81శాతం మంది ఉద్యోగులు ఇదే ఫాలో అయ్యారు. తక్కువ ఒత్తిడికి గురైన వయస్సు సమూహం 41 ఏళ్ల నుంచి 50 సంవత్సరాలు. అయితే, 53.5శాతం మంది ఉద్యోగులు మాత్రమే అధిక స్థాయి కార్యాలయంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు నివేదించారు. "వర్క్‌ప్లేస్ డైనమిక్స్‌లో మార్పు, రిమోట్, హైబ్రిడ్ వర్క్ మోడల్స్ పరిణామం, 21ఏళ్ల నుంచి 30 ఏళ్ల జనాభాపై ప్రభావం చూపింది. సంస్థలు రెగ్యులర్ కమ్యూనికేషన్, ఎంగేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి'' చీఫ్ సైకాలజీ ఆఫీసర్ డాక్టర్ జిని గోపీనాథ్ అన్నారు. ఐటీ, తయారీ, రవాణా, సిబ్బంది, నియామకాలు, టెక్, మీడియా, న్యాయ సేవలు, వ్యాపార సలహా, సేవలు మరిన్ని రంగాలలోని ఉద్యోగులను సర్వే చేసిన తర్వాత ఈ ఫలితాలు వెల్లడయ్యాయి.

# గర్భధారణ సమయంలో జికా వైరస్‌పై అవగాహన చాలా అవసరం

**విశ్వంభర, ఫీచర్ :** ఇటీవల కాలంలో జికా వైరస్ కేసులు భారీ సంఖ్యలో పెరుగుతున్నాయి. భారత్‌లోనూ జికా కేసులు చాలావరకూ నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరిస్తోంది. ఇప్పటికీ ఈ వైరస్ సంబంధిత హెచ్చరిస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది. ప్రధానంగా తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జికా వైరస్ అధిక ప్రభావితమైందని పేర్కొంది. జికా వైరస్ సోకిన వారిలో లక్షణాలను కనిపించడం లేదు. ఒకవేళ బయటపడితే జ్వరం, దద్దుర్లు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఎరుపు కళ్ళు (కండ్లకలక) వంటి లక్షణాలు ఉంటాయని తెలిపింది. సాధారణంగా దోమ కుట్టిన 3 నుంచి 14 రోజుల తర్వాత ఈ లక్షణాలు కనిపిస్తాయి. జికా వైరస్ అనేది ఆడ ఏడెస్ దోమ కాటుతో వ్యాపిస్తుంది. ముఖ్యంగా గర్భధారణ సమయంలో తల్లి నుంచి పిండానికి కూడా వేగంగా వ్యాపిస్తుంది. ఈ వైరస్ తల్లి పాలలోనూ ఉన్నట్టు అధ్యయనాల్లో తేలగా, తల్లి పాలివ్వడం ద్వారా బిడ్డకు వైరస్ వ్యాప్తి అవుతుందని ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. జికా వైరస్ లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. ఈ జికా వైరస్ లక్షణాలు బయటపడిన 7 రోజులలోపు ఆర్టీ పీసీఆర్ పరీక్ష చేయించుకోవాలి. అప్పుడే జికా వైరస్ నిర్ధారణ వీలు పడుతుంది. అంతేకాదు.. మూత్రం, లాలాజలం, అమ్నియోటిక్ ద్రవం లాంటి శరీర ద్రవాలలో కూడా వైరస్‌ను గుర్తించవచ్చు. గర్భధారణ సమయంలో జికా వైరస్ సంక్రమణతో శిశువులో తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. పుట్టుకతో వచ్చిన జికా సింద్రోమ్ (కాంజెనిటల్ జికా సింద్రోమ్) అని కూడా పిలుస్తారు.

**పాలిచ్చే తల్లుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**
మైక్రోసెఫాలీ అనేది చిన్నపాటి తల సైజులో ఉంటుంది. బ్రెయిన్ కాల్సిఫికేషన్‌లు, కండరాల స్థాయి పెరగడం, కంటి, వినికిడి సమస్యలతో అనేక అనారోగ్యాలకు దారితీస్తుంది. గర్భం దాల్చిన తొలి వారాల్లో జికా ఇన్ఫెక్షన్ సోకితే అత్యంత ప్రమాదం కూడా. జికా వైరస్ ఇన్ఫెక్షన్లతో 2016లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కూడా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ క్రమంలోనే గర్భిణీ స్త్రీలను టెస్టింగ్ చేయడం, పాజిటివ్ వస్తే తల్లులలో పిండాల పెరుగుదలపై పర్యవేక్షించడం చేయాలని ఫెర్నాండెజ్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి ఆస్పత్రులకు పలు సూచనలు చేశారు. జికా వైరస్‌ను నివారణకు వ్యక్తిగతంగా కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమల కాటుకు గురికాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమ్యూనిటీల్లో వాటర్ కంటైనర్‌లను మూసి ఉంచాలని, సురక్షితమైన నీటిని కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వ్యర్థాలను పారవేయడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని డాక్టర్ తారకేశ్వరి సూచించారు. దోమలు కుట్టకుండా ఉండేలా శరీరమంతా కప్పిఉండేలా దుస్తులు ధరించాలి. పెర్మెత్రిన్ పూత కలిగిన నెట్ ఉపయోగించాలి.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com